




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 306 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 7 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 306 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 7 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం.. స్వయంగా వచ్చి ఆహ్వానించిన ఇండోనేషియా అధ్యక్షుడు

- ఇండోనేషియాకు చేరిన ప్రధాని మోదీ
- స్వయంగా వచ్చి ఆహ్వానించిన అధ్యక్షుడు ప్రబోవో
- యుద్ధ విమానాలతో మోదీ విమానానికి ఎస్కార్ట్
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు
- ప్రంబనన్ ఆలయ సముదాయం సందర్శించనున్న మోదీ
- రక్షణ, వాణిజ్య సహకార విస్తరణపై దృష్టి

- మిగతా 2లో





## రూ.70 వేలు లంచం.. ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన చేర్యాల తహసీల్దార్

- సిద్దిపేట జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్
- చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు
- నాలా కన్వర్షన్ కోసం రూ.70,000 డిమాండ్ చేసినట్లు ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:సిద్దిపేట జిల్లాలో ఒక ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. చేర్యాల తహసీల్దార్‌గా విధి నిర్వహణలో ఉన్న కొర్రా దిలీప్ నాయక్, రూ.70,000 లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు సోమవారం

- మిగతా 2లో



## మైక్రోసాఫ్ట్‌లో భారీ లేఆఫ్‌లు.. 4,800 ఉద్యోగాల కోత..!

పెన్ పవర్ డెస్క్:అంతర్జాతీయ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సంస్థ భారీ లేఆఫ్‌లు ప్రకటించింది. తమ సంస్థలో 4,800 మంది ఉద్యోగులను తొలగించనుంది. ఇది ఆ కంపెనీ ప్రపంచ వ్యాప్త ఉద్యోగుల్లో 2.1 శాతం

- మిగతా 2లో

## ఏపీలో కాగ్నిజెంట్.. విశాఖ ఐటీ సెజ్‌కు కేంద్రం ఆమోదం

- విశాఖలో కాగ్నిజెంట్ ఐటీ సెజ్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- మధురవాడలో 8.98 హెక్టార్ల విస్తీర్ణంలో దీని ఏర్పాటు
- తెలంగాణలో రెండు సెజ్‌ల ప్రతిపాదనలను వెనక్కి తీసుకున్న సంస్థ
- ఈ ప్రాజెక్ట్‌తో భారీగా ఉద్యోగాలు వస్తాయని అంచనా
- సెజ్‌ను ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోగా ప్రకటించిన కేంద్రం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగాన్ని పరుగులు పెట్టించే కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ టెక్నాలజీ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ

- మిగతా 2లో



## నేడు,రేపు కడప జిల్లాలో పర్యటించనున్న జగన్

- నేడు ఉదయం 11.30 గంటలకు పులివెందుల చేరుకోనున్న జగన్
- నేడు రాత్రికి పులివెందులలోనే బస
- రేపు ఇడుపులపాయలో వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రేపటి నుంచి రెండు రోజుల పాటు కడప జిల్లాలో పర్యటించనున్నారు. పార్టీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం... రేపు ఉదయం 11.30 గంటలకు

- మిగతా 2లో






## ఆర్టీజీ కేంద్రం నుంచి ఇక 24 గంటల సేవలు...

### సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- ప్రజా సమస్యలపై రియల్ టైమ్‌లో స్పందించాలని అధికారులకు సీఎం ఆదేశం
- పీజీఆర్ఎస్ కింద పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి
- పట్టణ ప్రాంతాల్లో జీరో వేస్ట్ లక్ష్యంగా మూడు నెలల్లో చెత్త తొలగింపు
- గంజాయిపై ఉక్కుపాదం మోపాలి, మహిళల భద్రతకు పెద్దపీట
- మారుమూల గ్రామాల్లో కమ్యూనికేషన్ టవర్ల ఏర్పాటుకు కార్యాచరణ

పెన్ పవర్ డెస్క్:ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై రియల్ టైమ్‌లోనే స్పందన ఉండాలని, ప్రభుత్వ సేవల్లో వేగాన్ని పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఐదు రోజుల జిల్లాల పర్యటన ముగించుకుని అమరావతికి చేరుకున్న ఆయన, సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్సు (ఆర్టీజీ) కేంద్రంలో ఉన్నతాధికారుల తో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ వంటి కీలక శాఖల పనితీరు, ప్రజా సేవల్లో నాణ్యతపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవలు అందించగలమని, పాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన అన్నారు.రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రం నుంచి ప్రజలకు వాస్తవ సమయంలోనే స్పందన అందాలని చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ సముద్ర తీరంలో

- మిగతా 2లో

## విశాఖలో 'బే సిటీ'.. అమరావతి, తిరుపతిలో స్పోర్ట్స్ సిటీలు: అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం




**విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సమీక్ష**

- ఏపీ సమగ్రాభివృద్ధికి త్రైపాక్షిక వ్యూహం
- విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళిక
- 6 నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్ల మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ఆదేశం
- మూడు రీజియన్లలో ప్రైవేట్ భాగస్వామ్యంతో స్పోర్ట్స్ సిటీల ఏర్పాటు



> "రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యం."
> – సీఎం చంద్రబాబు నాయుడు

### 51.88 చ.కి.మీ. విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ' అభివృద్ధికి కార్యాచరణ

**ఆరు నెలల్లో మాస్టర్ ప్లాన్‌లు**

విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక ఇప్పటికే ఆవిష్కరించగా, రాబోయే ఆరు నెలల్లో అమరావతి, తిరుపతి రీజియన్లకు కూడా మాస్టర్ ప్లాన్‌లు సిద్ధం చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ ముసాయిదా ప్రణాళికలను ప్రజలు, ప్రజాప్రతినిధుల ముందు ఉంచి, వారి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాతే తుదిరూపు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా, ప్రతి జిల్లాకు రెండు నెలల్లోగా 'డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్' రూపొందించాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఉన్న వనరులు, అవకాశాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు నిర్దేశించారు.

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ఏర్పాటు చేసిన మూడు ఎకనామిక్ రీజియన్ల అభివృద్ధిపై సోమవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ఉద్యాన పంటలతో కడప జిల్లా లింగాల మండలం సాధించిన అద్భుత ప్రగతిని స్ఫూర్తిగా తీసుకుని, మొత్తం రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రాంతాలను తలదన్నేలా, లింగాల మండలంలో ప్రజల తలసరి ఆదాయం రూ. 7.30 లక్షలుగా ఉండటం ఉద్యాన పంటల సత్తాకు నిదర్శనమని సీఎం అన్నారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ (టీఈఆర్) అభివృద్ధికి హార్టికల్చర్ ఒక గ్రోత్ ఇంజిన్‌గా పనిచేస్తుందని, ఈ ప్రాంతంలో 25కు పైగా ఉద్యాన ఉత్పత్తులు సాధించేలా చూడాలని ఆదేశించారు.

**'వైజాగ్ బే సిటీ'.. పర్యాటక సర్క్యూట్‌లు**

విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో 51.88 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ'ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తీరప్రాంత పర్యాటకం, గ్లోబల్ బిజినెస్–ఇన్నోవేషన్, గ్లోబల్ టాలెంట్–ఎలైట్ లివింగ్ అనే మూడు మూలస్తంభాలపై ఈ నగరాన్ని నిర్మించాలని సూచించారు. ఇక్కడ 3,291 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని అధికారులు సీఎంకు వివరించారు. రాబోయే మూడు నెలల్లో విశాఖలో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్, హోటళ్లు, ఐటీ ప్రాజెక్టులు తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. అరకు–పాడేరు–విశాఖను ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని,

- మిగతా 2లో

"రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం – మూడు రీజియన్లు, ఒక లక్ష్యం: స్వర్ణాంధ్ర 2047"



## నా రక్తంలోనే కాషాయం ఉంది

### పేర్ని నాని విమర్శలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ కౌంటర్!

- చెట్టు పేరు చెప్పుకుని కాయలమ్ముకునే వ్యక్తి పేర్ని నాని అని సత్యకుమార్ ఎద్దేవా
- తాను పదవుల కోసం ఆశపడే వ్యక్తి కాదని వ్యాఖ్య
- జగన్ ప్రజా వ్యతిరేక విధానాలపైనే తన పోరాటమన్న మంత్రి

- మిగతా 2లో



## ఖరీదైన ఇళ్ల విక్రయాల్లో హైదరాబాద్ టాప్.. బెంగళూరు, చెన్నై వెనక్కి!

- దక్షిణాదిలో రూ.11,246 కోట్లకు చేరిన లగ్జరీ గృహాల విక్రయాలు
- ఈ అమ్మకాలలో రూ.8,562 కోట్లతో హైదరాబాద్ అగ్రస్థానం
- బెంగళూరు, చెన్నై నగరాలను అధిగమించిన భాగ్యనగరం
- రూ.10 కోట్లకు హైదరాబాద్‌లో అత్యధికంగా 6,210 చదరపు అడుగుల స్థలం
- ఐటీ, వ్యాపార రంగాల అభివృద్ధే ఈ డిమాండ్‌కు కారణమని నివేదిక వెల్లడి

- మిగతా 2లో

## రావణ్‌తో వైసీపీకి ఎలాంటి సంబంధాలు లేవు

- కక్ష సాధింపులకు పోలీసులను ప్రభుత్వం వాడుకుంటోందన్న అంబటి
- సాధారణ యూట్యూబర్ రావణ్‌పై దేశద్రోహం చట్టాలను ప్రయోగించారని మండిపాటు
- రావణ్‌కు న్యాయ సహాయం అందిస్తామని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ప్రభుత్వం పోలీసు యంత్రాం గాన్ని వాడుకుంటూ ప్రతిపక్షాలే లక్ష్యంగా రాజకీయ కక్ష సాధింపులకు

- మిగతా 2లో



## ఒక్కటి కూల్చితే.. వంద కడతాం

### హైడ్రా నోటీసులపై అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు!

- ఫాతిమా కాలేజ్ పేరుతో తమను భయపెట్టాలని చూస్తున్నారన్న అక్బరుద్దీన్
- తాము ఎలాంటి అవినీతికి పాల్పడలేదన్న ఎంఐఎం ఎమ్మెల్యే
- పేదల కోసం వంద విద్యాసంస్థలు నిర్మిస్తామని వ్యాఖ్య

- మిగతా 2లో






# కేంద్ర కేబినెట్ విస్తరణకు బ్రేక్...

**న్యూఢిల్లీ, జూలై 6 (న్యూస్ పల్స్):** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రధాని నరేంద్ర మోదీ చేస్తారని జోరుగా ప్రచారం జరిగింది. మోదీ తన టీమ్‌ను పూర్తిస్థాయిలో మార్చేస్తారని, పనితీరు సరిగ్గా లేని మంత్రులను తొలగించి కొత్త ముఖాలకు, ముఖ్యంగా ఎన్డీయే కూటమి భాగస్వామ్య పక్షాలకు పెద్దపీట వేస్తారని అనుకున్నారు. అయితే, శనివారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వర్షాకాల సమావేశాల అధికారిక షెడ్యూల్‌ను ప్రకటించడంతో.. ఢిల్లీ పొలిటికల్ సమీకరణాలు ఒక్కసారిగా మారిపో యాయి. పార్లమెంట్ వేదికగా అత్యంత కీలకమైన సెషన్ నడవబోతున్న తరుణంలో.. ఈ లోపు క్యాబినెట్ విస్తరణ చేపట్టే సాహసం ప్రధాని మోదీ చేయడం లేదని, ఈ మార్పు చేర్పుల ప్రక్రియను ఆయన వ్యూహాత్మకంగా వాయిదా వేశారని క్లారిటీ వచ్చిందికేంద్ర కేబినెట్ మార్పుచేర్పుల వాయిదా వెనుక ఒక పక్కా పొలిటికల్ టైమింగ్ దాగి ఉందని తెలుస్తోంది. జూలై 20 నుండి ప్రారంభం కానున్న సమావేశాల ముందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన, వివాదాస్పదమైన రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురాబోతోంది. ముఖ్యంగా పీఎం, సీఎంల ఆటోమేటిక్ డిస్క్వాలిఫికేషన్‌కు సంబంధించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు పై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ జూలై 17న తన నివేదికను సమర్పించనుంది. దీనితో పాటు వన్ నేషన్ -- వన్ ఎలక్షన్ బిల్లుపై కూడా ఉభయ సభల్లో వాడివేడి చర్చలు జరగనున్నాయి. ఇలాంటి అత్యంత సంక్లిష్టమైన చట్టాలు పాస్ కావాల్సిన సమయంలో క్యాబినెట్‌ను కదిలిస్తే.. ప్రయారిటీ మారిపోతుందని అనుకుంటున్నారు.పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత, ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ఈ మెగా క్యాబినెట్ విస్తరణ , బిజెపి సంస్థాగత మార్పులు ఏకకాలంలో జరిగే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు కూడా క్యాబినెట్ విస్తరణపై మరింత పకడ్బందీగా కసరత్తు చేయాల్సిన అవసరాన్ని ప్రధానికి గుర్తుచేశాయి జూన్ చివరి వారంలో ప్రధాని మోదీ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అవ్వడం, ఆ తర్వాత వివిధ శాఖల కార్యదర్శులతో వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్‌పై సుదీర్ఘ సమీక్షలు నిర్వహించడం వెనుక.. ఏ ఏ మంత్రుల పనితీరు ఎలా ఉందో స్వయంగా నివేదికలు తెప్పించుకోవడానికేనని స్పష్టమవుతోంది. కూటమి ప్రభుత్వ మనుగడ, రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమీకరణాలను బ్యాలెన్స్ చేయాల్సి ఉన్నందున.. తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం కంటే, పూర్తి స్థాయి నివేదికలతో సెప్టెంబర్‌లో రంగంలోకి దిగడమే ఉత్తమమని ప్రధాని డిసైడ్ అయ్యారు.ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర మంత్రివర్గ మార్పులపై వెనక్కి తగ్గలేదు, కేవలం సమయాన్ని మాత్రమే మార్చారు. వర్షాకాల సమావేశాల రూపంలో విపక్షాల నుండి రాబోయే పొలిటికల్ తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొని, తమకు కావలసిన కీలక బిల్లులను పార్లమెంట్‌లో గట్టెక్కించుకోవడమే ప్రస్తుతానికి మోదీ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. ఆ తర్వాతే.. సెప్టెంబర్ వేదికగా 'టీం మోదీ' లోకి సరికొత్త భారీ మార్పులు, భారీ చేర్పులు ఉండబోతున్నాయనేది ఢిల్లీ వర్గాల అంచనా.

# ఏపీలో కాగ్నిజెంట్.. విశాఖ ఐటీ సెజ్‌కు కేంద్రం ఆమోదం

- మొదటి పేజి తరువాయి

సొల్యూషన్స్.. విశాఖపట్నంలో ఐటీ/ఐటీఈఎస్ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతులు పొందింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ జూన్ 25నే తుది నోటిఫై చేసింది. విశాఖపట్నం రూరల్ మండలం పరిధిలోని ఐటీ-మధురవాడ-2 ప్రాంతంలో 8.98 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ సెజ్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి జూన్ 11న కాగ్నిజెంట్ సంస్థకు లెటర్ ఆఫ్ అప్రూవల్ కూడా జారీ అయింది. సెజ్ చట్టం ప్రకారం డెవలప్‌మెంట్ కమిషనర్ నేతృత్వంలో ఒక అప్రూవల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కస్టమ్స్ కార్యకలాపాలను సులభతరం చేసేందుకు ఈ సెజ్‌ను 'ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో'గా కూడా ప్రకటించడం విశేషం.కొన్ని నెలల క్రితం, ఫిబ్రవరిలో, తెలంగాణలోని నానక్‌రామ్‌గూడ, ఆదిభట్లలో రెండు ఐటీ సెజ్‌ల ప్రతిపాదనలను కాగ్నిజెంట్ వెనక్కి తీసుకుంది. ఆ తర్వాత ఇప్పుడు విశాఖలో భారీ ప్రాజెక్ట్‌కు అనుమతులు సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రాజెక్ట్‌తో సుమారు రూ.1,580 కోట్ల పెట్టుబడి, దాదాపు 8,000 ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా. దశలవారీగా పూర్తిస్థాయి క్యాంపస్‌ను అభివృద్ధి చేయనుండగా, విశాఖపట్నం ఐటీ స్వరూపాన్ని ఈ ప్రాజెక్ట్ సమూలంగా మార్చనుందని నిపుణులు భావిస్తున్నారు.

# విశాఖలో 'బే సిటీ'.. అమరావతి, తిరుపతిలో స్పోర్ట్స్ సిటీలు

- మొదటి పేజి తరువాయి

సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన నగరాల్లో ప్రైవేట్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ సిటీలు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు.

**అమరావతి, తిరుపతి రీజియన్ల అభివృద్ధి**

రాష్ట్ర జనాభాలో 32 శాతం, భౌగోళికంగా 33 శాతం విస్తరించి ఉన్న అమరావతి ఎకనామిక్ రీజియన్ (ఏఈఆర్) అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. మొత్తం 9 జిల్లాల పరిధిలోని ఈ రీజియన్‌లో ఆక్వా, పామాయిల్, కోకో ఉత్పత్తులతో పాటు కొల్లేరు సరస్సును అభివృద్ధికి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. మరోవైపు, విశాఖ, అమరావతి రీజియన్లతో పోటీపడేలా తిరుపతి ఎకనామిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఖనిజ సంపద, పుణ్యక్షేత్రాలు, విద్యాసంస్థలు, పర్యాటక ప్రాంతాలతో టీఈఆర్‌కు ఎన్నో అనుకూలతలు ఉన్నాయన్నారు. శ్రీసిటీ, ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామికవాడలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, పునరుత్పాదక ఇంధనం, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పెట్టుబడులకు ఈ ప్రాంతం స్వర్గధామం కావాలన్నారు.స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంలో టీఈఆర్ వాటాను 0.90 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మూడు రీజియన్ల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మూడు రీజియన్ల ప్రత్యేక అధికారులు ముఖేష్ కుమార్ మీనా, సురేశ్ కుమార్, యువరాజ్ పాల్గొన్నారు.

# ఒక్కటి కూల్చితే.. వంద కడతాం
## హైడ్రా నోటీసులపై అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు!

సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించారంటూ ఫాతిమా ఒవైసీ విద్యాసంస్థలపై హైడ్రా విచారణ జరుపుతున్న నేపథ్యంలో, చాంద్రాయణగుట్ట ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ గౌస్‌నగర్‌లోని విద్యా క్యాంపస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఫాతిమా కళాశాల పేరుతో తమను భయపెట్టాలని చూస్తున్నారని, తాము ఎలాంటి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు.తమ విద్యాసంస్థలను కూల్చివేస్తామంటూ వస్తున్న బెదిరింపులకు తలొగ్గే ప్రసక్తే లేదని, వాటిని ఎలా కాపాడుకోవాలో తమకు బాగా తెలుసని అక్బరుద్దీన్ హెచ్చరించారు. "ఒక్క విద్యాసంస్థను కూల్చేస్తే.. పేద ప్రజల కోసం వంద విద్యాసంస్థలను నిర్మించి చూపిస్తాం" అని ఆయన సవాల్ విసిరారు. సంస్థలు ఉన్నా లేకపోయినా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు.ఈ సందర్భంగా సాలార్-ఎ-మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ హోదాలో 366 మంది పేద విద్యార్థుల పేరున రూ.కోటీ 19 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, ఉచిత పుస్తకాలను పంపిణీ చేశారు.

# రూ.70 వేలు లంచం..
## ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన చేర్యాల తహసీల్దార్

- మొదటి పేజి తరువాయి

అరెస్ట్ చేశారు.ఏసీబీ అధికారులు విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, నాగపురి గ్రామంలోని పలు సర్వే నంబర్లకు సంబంధించి 11 నాలా (వ్యవసాయేతర భూమి మార్పిడి) దరఖాస్తుల ప్రాసెసింగ్ కోసం ఫిర్యాదుదారుడి నుంచి తహసీల్దార్ ఈ లంచం డిమాండ్ చేశారు. జమున కనకమ్మ మరియు ఇతరుల పేర్లపై ఉన్న 30 గుంటల భూమికి సంబంధించిన పనుల నిమిత్తం ఆయన ఈ మొత్తాన్ని తీసుకున్నారు.
సోమవారం మధ్యాహ్నం చేర్యాలలోని తన కార్యాలయంలోనే దిలీప్ నాయక్ లంచం తీసుకుంటుండగా, పక్కా ప్రణాళికతో ఏసీబీ అధికారులు ఆయనను పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దిలీప్ నాయక్‌ను అరెస్ట్ చేసి, హైదరాబాద్‌లోని ఏసీబీ కేసుల విచారణ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే తమ టోల్-ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం అందించాలని ఏసీబీ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం..
## స్వయంగా వచ్చి ఆహ్వానించిన ఇండోనేషియా అధ్యక్షుడు

మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఇండోనేషియా రాజధాని జకార్తాకు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన కోసం అక్కడి చేరుకున్న ఆయనకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలకడం విశేషం. ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు ప్రతీకగా ఈ ప్రత్యేక ఆతిథ్యాన్ని భావిస్తున్నారు.భారత ప్రధాని ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేషియా గగనతలంలోకి ప్రవేశించిన వెంటనే ఆ దేశ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్ చేశాయి. జకార్తా విమానాశ్రయంలో సంప్రదాయ ఇండోనేషియా నృత్య ప్రదర్శనలతో మోదీకి ఆత్మీయ స్వాగతం లభించింది.ఈ పర్యటనలో మోదీ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. భారత్-ఇండోనేషియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, వాణిజ్యం, రక్షణ, సముద్ర భద్రత, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై ఇరువురు నేతలు చర్చించనున్నారు.పర్యటనకు ముందు విడుదల చేసిన ప్రకటనలో 2018లో భారత్-ఇండోనేషియా సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేశామని మోదీ గుర్తు చేశారు. ఈ భాగస్వామ్యం తర్వాత తన తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదేనని పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రబోవో పర్యటనకు కొనసాగింపుగానే ఈ భేటీ జరుగుతోందని తెలిపారు.ఇండోనేషియాలోని భారతీయ ప్రవాసులతో మోదీ సమావేశం కానున్నారు. అలాగే ప్రబోవోతో కలిసి యోగ్యకర్తలోని ప్రసిద్ధ ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఈ ఆలయం భారత్-ఇండోనేషియా సాంస్కృతిక బంధానికి ప్రతీకగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు.ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో సహకారం మరింత బలపడింది. బ్రహ్మోస్ క్షిపణుల విక్రయం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, సైనిక శిక్షణ, రక్షణ పరిశ్రమల్లో భాగస్వామ్యం విస్తరిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్-ఇండోనేషియా ద్వైపాక్షిక వాణిజ్యం 24.78 బిలియన్ డాలర్లకు చేరగా, 130కి పైగా భారత కంపెనీలు ఇండోనేషియాలో పెట్టుబడులు పెట్టాయి.ఇండోనేషియా పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించనున్నారు.

# ఆర్టీజీ కేంద్రం నుంచి ఇక 24 గంటల సేవలు...

- మొదటి పేజి తరువాయి

బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనను ఉదాహరణగా చూపుతూ, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వివిధ ప్రభుత్వ విభాగాలు ఎంత తక్షణమే సమన్వయంతో స్పందించాయన్నదే కీలకమని అన్నారు.
ప్రభుత్వ యంత్రాంగం మధ్య సమన్వయం కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఆధ్వర్యంలో తరచూ మల్టీ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేషన్ సమావేశాలు జరగాలని సూచించారు. ఆర్టీజీ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని నిర్దేశించారు."ఏఐ మెథడాలజీ ద్వారా చిత్తూరు జిల్లాలో సంతృప్తి స్థాయి నమోదు చేస్తున్నాం. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం వల్ల ప్రజాభిప్రాయం నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. నియోజకవర్గ స్థాయిలో 'లాస్ట్ మైల్ గవర్నెన్స్' ప్రజలకు అందాలి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్‌మెంట్, బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలి," అని ముఖ్యమంత్రి విశ్లేషించారు.

**పీజీఆర్ఎస్ పరిష్కారానికి యాక్షన్ ప్లాన్**

పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సీఎం చంద్రబాబు గట్టిగా ఆదేశించారు. వివిధ కేటగిరీలు, శాఖలకు చెందిన పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఒక పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి, ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారం చూపాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

**పట్టణాల్లో 'జీరో వేస్ట్' లక్ష్యం**

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పేరుకుపోయిన 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రాబోయే మూడు నెలల్లోగా యుద్ధప్రాతిపదికన తొలగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో 'జీరో వేస్ట్' సాధించడమే మన లక్ష్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బృహత్కార్యంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములై శ్రద్ధ పెట్టాలని కోరారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ వంటి కార్యక్రమాలపై నిర్దిష్ట ప్రామాణిక కార్యాచరణ విధానం జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఖరీదైన ఇళ్ల విక్రయాల్లో హైదరాబాద్ టాప్..
## బెంగళూరు, చెన్నై వెనక్కి!

దక్షిణ భారతదేశంలోని మూడు ప్రధాన నగరాల్లో అల్ట్రా-లగ్జరీ గృహాల మార్కెట్ సరికొత్త శిఖరాలకు చేరింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో రూ.10 కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన 811 విలాసవంతమైన ఇళ్లు అమ్ముడయ్యాయి. వీటి మొత్తం అమ్మకాల విలువ రూ.11,246 కోట్లుగా నమోదైంది. ఈ వివరాలను 'సదరన్ ఇండియా హై-ఎండ్ లగ్జరీ హౌసింగ్' పేరుతో ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాల్టీ, సీఆర్ఈ మ్యాట్రిక్స్ సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది.ఈ విక్రయాల్లో హైదరాబాద్ నగరం స్పష్టమైన ఆధిక్యంతో అగ్రస్థానంలో నిలిచింది. ఒక్క హైదరాబాద్‌లోనే 625 లగ్జరీ ఇళ్లు అమ్ముడుపోగా, వాటి విలువ రూ.8,562 కోట్లుగా ఉంది. హైదరాబాద్ తర్వాత బెంగళూరులో 128 ఇళ్ల అమ్మకాల ద్వారా రూ.1,957 కోట్లు, చెన్నైలో 58 ఇళ్ల విక్రయాల ద్వారా రూ.727 కోట్ల వ్యాపారం జరిగింది. ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో తక్కువ ధరకే ఎక్కువ స్థలం లభించడం ఈ వృద్ధికి కీలక కారణంగా కనిపిస్తోంది. ఉదాహరణకు, రూ.10 కోట్లతో హైదరాబాద్‌లో సుమారు 6,210 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు కొనుగోలు చేయగలిగితే, అదే మొత్తానికి చెన్నైలో 4,290 చదరపు అడుగులు, బెంగళూరులో కేవలం 3,930 చదరపు అడుగుల స్థలం మాత్రమే లభిస్తోంది. హైదరాబాద్‌లోని కోకాపేట, బెంగళూరులోని రాజనుకుంటె ప్రాంతాలు అల్ట్రా-ప్రీమియం ప్రాజెక్టులకు హాట్‌స్పాట్‌లుగా నిలిచాయి.ఈ నివేదికపై ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాల్టీ సీఈఓ అశ్విన్ చద్దా మాట్లాడుతూ, "దక్షిణ భారతదేశంలోని లగ్జరీ గృహాల మార్కెట్ మూడు విభిన్న నగరాల ప్రత్యేకతలతో రూపుదిద్దుకుంటోంది. అమ్మకాల పరిమాణంలో హైదరాబాద్ అగ్రగామిగా నిలుస్తుండగా, బెంగళూరు వేగవంతమైన వృద్ధి సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోంది. మరోవైపు చెన్నై తన పాత, ప్రతిష్టాత్మకమైన ప్రీమియం ప్రాంతాలపై ఆధారపడి స్థిరంగా కొనసాగుతోంది," అని వివరించారు.సీఆర్ఈ మ్యాట్రిక్స్ సహ-వ్యవస్థాపకుడు, సీఈఓ అభిషేక్ కిరణ్ గుప్తా మాట్లాడుతూ, ఈ రంగం ఒక కీలక మలుపుకు చేరుకుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ మార్కెట్‌కు బలమైన పునాదులు ఉన్నాయని, బెంగళూరు సంప్రదాయ ఉన్నత వర్గాల ప్రాంతాలకు అతీతంగా విస్తరిస్తోందని పేర్కొన్నారు. ప్రతి మార్కెట్‌కు అనుగుణంగా ప్రత్యేకమైన పెట్టుబడి వ్యూహాలు అవసరమని ఆయన సూచించారు. ఈ నగరాలు ఐటీ, వ్యాపార కేంద్రాలుగా వేగంగా వృద్ధి చెందడంతో అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు, సంపన్న కొనుగోలుదారులు విశాలమైన, అత్యున్నత సౌకర్యాలున్న గృహాల వైపు మొగ్గుచూపుతున్నారని నివేదిక స్పష్టం చేస్తోంది.

# నా రక్తంలోనే కాషాయం ఉంది

వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ నేత సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన.. పేర్ని నానిని 'చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్ముకునే వ్యక్తి'గా అభివర్ణించారు. తాను రాజకీయ లబ్ధి కోసం పార్టీలు మారే అవకాశవాదిని కాదని, తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే వ్యక్తినని స్పష్టం చేశారు. "నేను పదవుల కోసం ఆశపడే వ్యక్తిని కాదు. నా రక్తంలోనే కాషాయం, బీజేపీ సిద్ధాంతం ఉన్నాయి. సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఒక మంత్రిగా... ప్రభుత్వంపై చేసే అర్థరహితమైన విమర్శలను చూస్తూ ఊరుకోను" అని సత్యకుమార్ హెచ్చరించారు. వైసీపీ అధినేత జగన్ ను తాను వ్యక్తిగతంగా ఎప్పుడూ దూషించలేదని... ఆయన అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైనే తన పోరాటమని చెప్పారు. జగన్ ఒక నిలకడ లేని మనిషి అని, రాజధాని విషయంలో ఆయన మాట్లాడుతున్న తీరు చూస్తుంటే కనీస అవగాహన లోపం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగవంతం చేసి, అతి త్వరలోనే పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు గణనీయంగా మెరుగయ్యాయని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో వ్యవస్థను గాడిలో పెట్టాల్సి ఉందని, దానిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజల నుంచి వస్తున్న ప్రతి చిన్న సమస్య, ఫిర్యాదుపై తక్షణమే స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# రావణ్‌తో వైసీపీకి ఎలాంటి సంబంధాలు లేవు

- మొదటి పేజి తరువాయి

పాల్పడుతోందని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ నేతలతో పాటు సోషల్ మీడియా యాక్టివిస్టులు, రాజకీయ విశ్లేషకులను భయభ్రాంతులకు గురిచేసేందుకే అక్రమ కేసులు, అరెస్టుల పర్వానికి తెరలేపారని ఆయన మండిపడ్డారు.వివాదాస్పద యూట్యూబర్ రావణ్ (జోసెఫ్), కేవీఆర్ వంటి వారికి తమ వైసీపీతో ఎలాంటి ప్రత్యక్ష సంబంధాలు లేవని అంబటి స్పష్టం చేశారు. అయినప్పటికీ ఒక సాధారణ యూట్యూబర్‌పై దేశద్రోహం, 'ఉపా' వంటి కఠిన చట్టాలను ప్రయోగించడం ప్రభుత్వ దురహంకారానికి నిదర్శనమన్నారు. చట్ట పరిధి దాటి ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవచ్చు కానీ, దారుణమైన సెక్షన్లు పెట్టడం ఏంటని ప్రశ్నించారు.రావణ్‌ను శారీరకంగా అంతమొందించే ప్రయత్నాలు కూడా జరిగాయని అంబటి సంచలన ఆరోపణ చేశారు. ఈ కేసులో పిఠాపురం కోర్టుతో పాటు పలు న్యాయస్థానాలు రావణ్‌కు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా ప్రభుత్వం తన మొండి వైఖరిని మార్చుకోవడం లేదన్నారు. రావణ్ తమ పార్టీ వ్యక్తి కాకపోయినప్పటికీ, బాధితుడిగా అతనికి వైసీపీ తరఫున అవసరమైన పూర్తి న్యాయ సహాయాన్ని అందిస్తామని ప్రకటించారు.కేవీఆర్ అరెస్టు వ్యవహారంలో ఏపీ పోలీసులు కనీస చట్టపరమైన నిబంధనలు పాటించలేదని... అందుకే దౌర్జన్యంగా ప్రవర్తించిన ఏపీ పోలీసులపై ఏకంగా తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో సోషల్ మీడియాపై అధికారిక దౌర్జన్యకాండ సాగుతోందని అంబటి విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే కొందరు వ్యక్తులు అత్యంత అసభ్య పదజాలంతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నా... వారిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, చట్టం అందరికీ ఒకేలా ఎందుకు వర్తించడం లేదని నిలదీశారు.

# నేడు,రేపు కడప జిల్లాలో పర్యటించనున్న జగన్

- మొదటి పేజి తరువాయి

జగన్ పులివెందుల చేరుకుంటారు. అనంతరం తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక ప్రజలు, నాయకులను కలుసుకుంటారు. అక్కడ 'ప్రజాదర్బార్' నిర్వహించి, ప్రజల నుంచి స్వయంగా వినతులు, సమస్యల అర్జీలను స్వీకరిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలోనే బస చేస్తారు. బుధవారం ఉదయం పులివెందుల నుంచి బయలుదేరి 7.30 గంటలకు ఆయన ఇడుపులపాయకు చేరుకుంటారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని.. ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. ఈ సంస్మరణ కార్యక్రమం ముగిసిన అనంతరం జగన్ అక్కడి నుంచి తిరుగుప్రయాణం అవుతారు.

# మైక్రోసాఫ్ట్‌లో భారీ లేఆఫ్‌లు.. 4,800 ఉద్యోగాల కోత..!

- మొదటి పేజి తరువాయి

కావడం గమనార్హం. ఏఐ (కృత్రిమమేధ) పెట్టుబడులు, వ్యయ నియంత్రణపై మరింతగా దృష్టి సారిస్తుండటంతో సిబ్బందిని తగ్గించుకొనేలా చర్యలు చేపట్టినట్లు కథనాలు వస్తున్నాయి. టెక్ దిగ్గజ కంపెనీలైన అమెజాన్, మెటా కూడా ఈ ఏడాది వేలాది ఉద్యోగాల కోతను ప్రకటించాయి. ఈ ఏడాది పెద్ద టెక్నాలజీ కంపెనీల ఞ× పెట్టుబడులు 700 బిలియన్ డాలర్లను మించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో ఉద్యోగాల కోత ఉండొచ్చంటూ మే నెలలోనే మైక్రోసాఫ్ట్ సంకేతాలు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజా లేఆఫ్‌ల ప్రభావం మైక్రోసాఫ్ట్‌కు చెందిన గేమింగ్ విభాగం 'ఎక్స్‌బాక్స్'పై అధికంగా పడినట్లు తెలుస్తోంది. శరవేగగంగా మారుతున్న టెక్నాలజీ పరిశ్రమలో వినియోగదారుల అవసరాలకనుగుణంగా ఫలితాలను ఇచ్చే విభాగాలపై తాము మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ అమీ కోల్‌మన్ ఉద్యోగులకు పంపిన ఓ అంతర్గత మెమోలో పేర్కొన్నారు. ఈ భారీ ఉద్యోగాల కోతల వల్ల ఎక్స్‌బాక్స్ విభాగంలోనే 1600కు పైగా ఉద్యోగాలు రద్దవుతాయని సమాచారం.

# అదుపుతప్పి డివైడర్ ను ఢీ కొట్టిన లారీ



**సీతానగరం, పెన్ పవర్, జూలై06:** రాజమహేంద్రవరం నుంచి సీతానగరం వైపు వస్తున్న కాంక్రీట్ మిక్సర్ లారీ సోమవారం నాడు తెల్లవారుజామున రాపాక తూముల వద్ద డివైడర్ను ఢీకొట్టడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే నల్లగొండ జిల్లా నుంచి పోలవరం ప్రాజెక్టు పనులకు కాంక్రీట్ మిక్సర్ తీసుకు వస్తున్న క్రమంలో ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్ వైపుకు దూసుకుపోయింది. ఆ సమయంలో ఎటువంటి వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. లారీ నడుపుతున్న డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. మండలంలోని రఘుదేవపురం నుంచి సీతానగరం స్టేట్ బ్యాంకు వరకు రోడ్డు ఇరువైపులా ఆక్రమణలు తొలగించకుండా వేసిన రోడ్డుమీద వివిధ వ్యాపారాలు వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు పలువురు వాపోతున్నారు. పోలీస్ అధికారులు సాయంత్రం సమయంలో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


# పెన్ పవర్

పోలవరం - ఏలూరు

తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి


# మారుమూల గ్రామాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు





- గ్రీవెన్స్‌లో 170, రెవెన్యూ క్లినిక్‌లో 30 దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, రంపచోడవరం, జూలై 6:** పోలవరం జిల్లాలోని మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను పరిశీలించి, తక్షణమే పరిష్కరించగల అంశాలను వెంటనే పరిష్కరిస్తూ, మిగిలిన వాటిని సంబంధిత శాఖలకు పంపించి పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సోమవారం రంపచోడవరం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఆర్డీవో స్వాతి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వారానికి గ్రీవెన్స్‌లో 170, రెవెన్యూ క్లినిక్‌లో 30 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రజలు సమర్పించిన ముఖ్యమైన వినతుల్లో మారేడుమిల్లి మండలం గుర్రమామిడి--వాడపల్లి గ్రామాల మధ్య 12 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణం, జీఎంవలస గ్రామంలోని 84 ఎకరాల్లో గిరిజనులు సాగు చేసిన జామాయిల్ తోటలకు మూడో విడత కటింగ్‌కు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి, చింతూరు మండలం కొత్తపల్లి పాఠశాలకు భూమి ఇచ్చిన కుటుంబానికి హెల్పర్ పోస్టు మంజూరు చేయాలన్న అభ్యర్థన, మల్లవరం--నీలవరం నుంచి మారేడుమిల్లి గాలిగోపురం వరకు మెటల్ రోడ్డు నిర్మాణం, రంపచోడవరం మండలం పెద్ద కోరుమిల్లి గ్రామంలో భూ రికార్డుల సవరణకు సంబంధించిన వినతి ఉన్నాయి. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు సత్వరమే పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఐటిడిఏ అధికారులు, ఇంజనీర్లు, తహసీల్దార్లు, బ్యాంకు ప్రతినిధులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ప్రత్యేక సహాయం.. జూలై 14లోగా తప్పనిసరిగా అందజేయాలి: తహశీల్దారు సన్యాసిరావు



**పెన్ పవర్ ఉంగుటూరు, జులై 06:** ఎన్యూమరేషన్ ఫారాలు ఇంకా సమర్పించని ప్రతి ఓటరు ఈ నెల 14వ తేదీలోపు తప్పనిసరిగా పూర్తి చేసి సమర్పించాలని నియోజకవర్గ ఓటరు నమోదు సహాయ అధికారి (ఏఈఆర్వో), ఉంగుటూరు తహశీల్దారు మద్రాపు సన్యాసిరావు కోరారు. సోమవారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఫారం నింపడంలో ఇబ్బందులు ఉన్నా, వివరాలు తెలియకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బంది, బీఎల్ఓలు, సంబంధిత అధికారులు ప్రతి ఓటరికి అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా తమ ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఫారం సమర్పించని వారు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని, అందువల్ల ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఫారం పూర్తి చేసి అందజేయాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఉంగుటూరు మండలంలోని గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది టామ్‌టామ్ (మైక్ ప్రచారం) ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. అదేవిధంగా బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ ప్రాధాన్యతను వివరిస్తూ, అవసరమైన సహాయం అందిస్తున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని గడువులోగా ఫారాలు సమర్పించాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ఘనంగా125వ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు..

చిత్రపటానికి భారతీయ జనతా పార్టీ నాయకులు నివాళి ..



**కోరుకొండ, పెన్ పవర్, జూలై 6:** డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ కి 125 వ జయంతి సందర్భంగా సోమవారం ఉదయం కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలో భారతీయ జనతా పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన స్మృతులను గుర్తు చేసుకోవడం జరిగింది. భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ దేశానికి డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగం మరువలేదని ఉన్నతమైన కుటుంబంలో జన్మించినప్పటికీ భారతదేశ ఐక్యత కోసం అఖండ భారత దేశం కోసం కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం కావాలని కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి కాశ్మీర్ వెళ్లి అక్కడి ప్రజలలో ఐక్యత కోసం ఉద్యమం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసి నిర్బంధించి చిత్రహింసలకు గురిచేసి ఆయన మరణానికి కారకులయ్యారు.

ఇలాంటి మహానుభావుల జీవిత త్యాగాలను మనమందరం స్ఫూర్తిగా తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు, అనకాపల్లి జిల్లా ఇన్చార్జి ఏ పి ఆర్ చౌదరి, కోరుకొండ మండల ఇన్చార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిపాటి స్వర్ణ రజని, కోరుకొండ మండల ఉపాధ్యక్షురాలు సామవేదం రమణి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నీలపాల వెంకన్న, కోరుకొండ మండల బిజెపి అధ్యక్షులు అడపా సుధీర్ తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు..

-- రాష్ట్ర ఎస్సీ సెల్ టీడీపీ నాయకురాలు, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ మహిళా కౌన్సిల్ అధ్యక్షురాలు ఖండవల్లి లక్ష్మి..




**కోరుకొండ, పెన్ పవర్, జూలై 6;** కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై 'క్రిస్టియన్స్ మహాసభ' పేరిట కొందరు వ్యక్తులు చేస్తున్న విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదని రాష్ట్ర ఎస్సీ సెల్ టీడీపీ నాయకురాలు, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ మహిళా కౌన్సిల్ అధ్యక్షురాలు ఖండవల్లి లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి వాక్యాలను ఖండిస్తున్నామన్నారు. రాజానగరం నియోజకవర్గం దివాన్‌చెరువు గ్రామంలోని ఖండవల్లి లక్ష్మి నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు మాట్లాడారు.

ఈ సందర్భంగా ఖండవల్లి లక్ష్మి మాట్లాడుతూ 'క్రిస్టియన్స్ మహాసభ' అనే ముసుగులో జె. శ్రవణ్ కుమార్, రావణ్ వంటి వ్యక్తులు రాష్ట్ర అగ్రనాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పవిత్రమైన మత సభల వేదికలను రాజకీయ స్వార్థానికి, అసభ్య పదజాలంతో విమర్శలు చేయడానికి వాడుకోవడం దుర్మార్గమన్నారు.

కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజలంతా ప్రశాంతంగా జీవిస్తుంటే, ఇటువంటి వ్యక్తులు తమ ఉనికి కోసం, రాజకీయ లబ్ధి కోసం కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛ పేరిట సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించడం సరికాదని లక్ష్మి హితవు పలికారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల క్రైస్తవ, దళిత సామాజిక వర్గాలకు కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మరియు చట్టసభల గౌరవాన్ని భంగపరిచేలా ప్రవర్తిస్తున్న సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్థానిక ప్రతినిధులు, మహిళా సంఘాల నేతలు, దళిత నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రిపోర్టర్ రత్న కిషోర్ గుండెపోటుతో మృతి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 6:** నగరానికి చెందిన విశ్వం వాయిస్ రిపోర్టర్ రత్న కిషోర్ గుండెపోటుతో సోమవారం అకస్మాత్తుగా కన్నుమూశారు. రత్న కిషోర్‌కు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల జర్నలిస్టులు, వివిధ మీడియా సంస్థల ప్రతినిధులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రత్న కిషోర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ కుడిపూడి పార్థసారథి, వేణుగోపాల స్వామి, మోతా సారథి, సత్య, దామోదర్, సుబ్బు, దొరబాబు, మధు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఖండవల్లి లక్ష్మి, మేడ శ్రీనివాస్, పెంకె సురేష్, భావన కుమారి, కావూరి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసిఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

' ఐదు రోజులకు '

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


# రహదారి నిర్మాణంతో మారంపల్లికి మహర్దశ: కలెక్టర్ నాగరాణి





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జులై 06:** రహదారి నిర్మాణంతో మారంపల్లి గ్రామాభివృద్ధికి మహర్దశ వచ్చిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. తాడేపల్లిగూడెం మండలం మారంపల్లి గ్రామంలో రహదారి నిర్మాణాన్ని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తో కలిసి కలెక్టర్ సోమవారం క్షేత్ర పరిశీలన చేశారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి ఎన్నో సంవత్సరాలుగా ప్రత్యక్ష రహదారి లేక ప్రజలు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్ కృషి తో రహదారి సాకారమయిందన్నారు. ఎమ్మెల్యే నిరంతర పర్యవేక్షణ చేయడంతో గ్రామానికి 1170 మీటర్ల నూతన రహదారి ఏర్పడిందని అన్నారు. రహదారి మొత్తం డబ్ల్యూ.బీ.ఎం.విధానంలో నిర్మించారని తెలిపారు.

ఈ రహదారి అందుబాటులోకి రావడంతో గ్రామానికి రాకపోకలు సులభతరం అవుతాయని, విద్యార్థులు పాఠశాలలకు, ప్రజలు సబ్‌సెంటర్‌తో పాటు ఇతర ప్రభుత్వ సేవలను సులభంగా పొందేందుకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామాభివృద్ధికి దోహదపడే ఈ రహదారి నిర్మాణం పట్ల గ్రామస్థులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని కలెక్టర్ అన్నారు. వి బి జి రాం జి పథకంలో బిటి రోడ్ నిర్మించాలని ఎమ్మెల్యే కోరారని, త్వరలో మంజూరు చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచార సమయంలో మారంపల్లి గ్రామ ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు ఈ రహదారి నిర్మాణం చేపట్టామన్నారు. గ్రామానికి వెళ్లేందుకు రైల్వే భూమిలో ఉన్న సన్నని మార్గం ఒకటే ఉండటంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారని అన్నారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని ఈ సమస్య తన హయాంలో పరిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


# జాలిపూడి ఎస్సీ కాలనీలో నెక్స్ జెన్ సౌజన్యంతో బోరు ఏర్పాటు

* హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు
* రూ.7 లక్షలు ఆర్డబ్ల్యూఎస్ నిధులు వృధా

**ఏలూరు జూలై 6 పెన్ పవర్ :** గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా రక్షిత మంచినీటి పథకం కింద చేపట్టిన బోరు నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, చేసిన పనులు అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల గ్రామస్తుల తాగునీటి అవసరాలు తీరకపోగా జాలిపూడి కాలనీవాసులు గత రెండేళ్లుగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు నెక్జెన్ అధినేత అడుసుమిల్లి వెంకటసుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి రూ. 10 లక్షలు వ్యయంతో జాలిపూడి గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసుల దాహార్తిని చేర్చడానికి బోరు ఏర్పాటు చేయడం జరిగిందని జాలిపూడి మాజీ ఉపసర్పంచ్ దాసరి నరసింహారావు (బుజ్జి బాబు) తెలిపారు. ఆర్డబ్ల్యూఎస్ నిధులతో ఇంజనీరింగ్ విభాగం అధికారులు రూ.7 లక్షల నిధులు వెచ్చించి బోర్లు తవ్వినప్పటికీ చుక్క నీరు రాకపోగా.. బోరు, కేసింగ్ పైపులు భూమిలోకి కృంగిపోయి నీరు రాక కాలనీవాసులు ఇక్కట్లకు గురయ్యారు. అయినా బిల్లులు మాత్రం చెల్లించేసారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలనీవాసుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూ పది లక్షల వేయంతో నెక్స్ జెన్ అధినేత బోరు ఏర్పాటు చేశారు. దీంతో భూమి నుండి గంగ ఉప్పొంగి నేలపైకి వచ్చింది. తమ కాలనీలో కష్టాలను గుర్తించి బోర్ ఏర్పాటు చేసిన సుబ్రమణ్యం గారికి జాలిపూడి ఎస్సీ కాలనీ వాసులు, జాలిపూడి అభివృద్ధి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శోభన్ బాబును వివరణ కోరగా ఆర్డబ్ల్యూఎస్ నిధులతో ఏర్పాటు చేసిన బోరు విషయం కనుక్కుని త్వరలో కనెక్షన్ ఇస్తామని తెలిపారు.

ఏ ఇ వివరణ: ఎస్సీ కాలనీలో బోరు ఏర్పాటు విషయమై ఏ ఇ ని వివరణ కోరగా బోరు, కేసింగ్ పైపులు భూమిలోకి దిగుబడిపోయిన విషయం వాస్తవమేనని, బోరు కి సంబంధించిన సామాగ్రిని, కేసింగ్ పైపులను పంచాయితీకి స్వాధీనం చేశామని తెలిపారు.



## కాకినాడ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులుగా కొండ శ్రీను నియామకం



**గోకవరం పెన్ పవర్ జులై 06:--**కాకినాడ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా కొండ శ్రీను నియమితుల య్యారని దీనికి సంబందించి కాకినాడ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానంద రావు ప్రకటించారని కొండ శ్రీను తెలిపారు.వీరితోపాటు జిల్లా కాంగ్రెస్ సెక్రటరీగా బదిరెడ్డి ప్రసాద్ జగ్గంపేట నియోజకవర్గం కిసాన్ సెల్ అధ్యక్షుడిగా కోలపర్తి వీర వెంకట రావు లను నియమించారు పి సి సి జనరల్ సెక్రెటరీ పాలకూరమ్మ మాజీ కేంద్ర మంత్రివర్యులు మల్లిపూడి మంగపతి పల్లం రాజు జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్ మరో శివ గణేష్ ల ఆశీస్సులతో ఈ నియామకం జరిగినట్లు కొండ శీను తెలిపారు. ఈ సందర్భంగా డి సీ సీ ఉపాధ్యక్షులు కొండ శీను మాట్లాడుతూ నా మీద నమ్మకంతో స్టేట్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రెటరీ బాధ్యతతో పాటు జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పజెప్పినటువంటి కేంద్ర మాజీ మంత్రివర్యులు సి డబ్ల్యూ సి సభ్యులు పల్లం రాజు గారికి జిల్లా అధ్యక్షులు సత్యానంద రావు గారికి మరోటి శివ గణేష్ గారికి నాకు ఇచ్చిన బాధ్యతలు పార్టీ బలోపేతానికి నిర్వహిస్తానని అంతేకాకుండా జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా కూడా నియమించినందుకు నాకు ఇచ్చిన బాధ్యతలు పార్టీ అభివృద్ధికి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పెద్దలందరూ కూడా నాకు ఈ బాధ్యత కొంచెం అందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను

## ఘనంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి..



**అడ్డతీగల, పెన్ పవర్, జూలై06;**శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా అడ్డతీగల మండలం, వేటమామిడి గ్రామంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఈ .స్వప్న కుమారి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ,బూత్ సభ్యులందరూ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వప్న కుమారి మాట్లాడుతూ యువత శ్యాంప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలని అలానే ఆశయ సాధన కృషి చేయాలని స్వప్న కుమారి పిలుపునిచ్చారు. ఆయన దేశానికి చేసిన సేవలను, జాతీయ సమైక్యత కోసం చేసిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

## కార్పొరేషన్ పీజీఆర్ఎస్ లో 24 అర్జీలు



**రాజమహేంద్రవరం పెన్ పవర్, జూలై 6:**ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) లో స్వీకరించిన అర్జీలను పున: పరిశీలనకు తావు లేకుండా పరిష్కరించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 24 అర్జీలు రాగా వీటిలో ఇంజనీరింగ్ కి సంబంధించి 6, రెవెన్యూకి సంబంధించి 3, టౌన్ ప్లానింగ్ కి సంబంధించి 10, పబ్లిక్ హెల్త్ కి సంబంధించి 4, అకౌంట్స్ విభాగానికి సంబంధించి ఒకటి ఉన్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్ని విభాగాల అధికారులకు సూచించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పీజీఆర్ఎస్ పోర్టల్ లో నమోదైన ఫిర్యాదులు ఎట్టిపరిస్థితుల్లోనూ పెండింగ్ లో ఉండకూడదని, నూరుశాతం పరిష్కరించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రజలు 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా.. లేదా మీకోసం పోర్టల్ లో అర్జీలను ఆన్ లైన్ లో సమర్పించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామ లింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎస్ఈ రీటా, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ అబ్దుల్ మలిక్, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## బాదంపూడిలో ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు



**పెన్ పవర్, ఉంగుటూరు, జులై 06:**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరు మండలం బాదంపూడి స్వర్ణ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

ఓటర్ల నుంచి ఎన్యుమరేషన్ ఫారాలు స్వీకరించడం, వాటిని సక్రమంగా నింపేందుకు సహాయకులను నియమించి ప్రతి ఓటరికి సేవలు అందిస్తున్నట్లు పంచాయతీ అభివృద్ధి అధికారి కాకర్ల వెంకట గిరిధర్ తెలిపారు.

గ్రామంలోని మూడు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్వోలు ఇప్పటికే పంపిణీ చేశారని ఆయన చెప్పారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లినప్పుడు ఓటర్లు ఇంట్లో లేకపోవడం, ఓటర్లు బీఎల్వోలను కలిసేందుకు వచ్చినప్పుడు వారు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలకు పరిష్కారంగా ఈ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఈ ఏర్పాటుపై గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బందితో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, ఇతర సిబ్బంది కూడా సేవలు అందించారు. గ్రామంలో మైక్ ద్వారా విస్తృత ప్రచారం చేయడంతో పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకువచ్చి పూర్తి చేసి సమర్పించినట్లు గిరిధర్ తెలిపారు.

ఈ ప్రత్యేక శిబిరం నాలుగు రోజుల పాటు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు

## పోలీసు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం లో 31 ఫిర్యాదులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,జూలై 6:** ప్రభుత్వం చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం", కార్యక్రమాన్ని తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు.జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి స్వయంగా అడిగి తెలుసుకుని, సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చారు.

పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" లో 31 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు మరియు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు.

## కుక్కలకు, కుక్కల యజమానులకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 6** :ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర ఏరియా పశు వైద్యశాలలో సోమవారం పశుసంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో భారీ స్థాయిలో యాంటీ రేబిస్ టీకాల కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరై జూనోసిస్ వ్యాధులపై పశు సంవర్ధక శాఖ అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కుక్కలు వాటి యజమానులకు యాంటీ రేబిస్ టీకాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా 528 కుక్కలకు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 323 మంది కుక్కల యజమానులకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేశారు. జంతువులు, మనుషుల ఆరోగ్య పరిరక్షణలో "వన్ హెల్త్ భావనను ప్రతిబింబించే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడం అవసరమన్నారు. వాటికి సకాలంలో వ్యాక్సినేషన్ చేయించడం ద్వారా రేబిస్ ప్రాణాంతక వ్యాధులను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత వ్యాక్సినేషన్ చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ సహకారం, సీఎస్ఆర్ నిధులు, దాతల సహకారంతో పశు వైద్యశాలలో ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించామని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు రూ.57 లక్షల వ్యయంతో అత్యాధునిక ఎక్స్రే, అల్ట్రాసౌండ్ (స్కానింగ్) పరికరాలు,నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు.

ఈ సందర్భంగా దాత కొప్పాక వెంకట నారాయణ అందించిన రూ.1 లక్ష విరాళంతో ఆధునీకరించిన ఆపరేషన్ థియేటర్, ఎక్స్రే గదిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డా. కె. సత్యనారాయణ మాట్లా డుతూ రేబిస్ వ్యాధి లక్షణాలు, వ్యాధి దశలు, జూనోటిక్ ప్రాధాన్యం, కుక్కలకు సకాలంలో టీకాలు వేయించడం వల్ల కలిగే ప్రయోజనాలపై వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కుక్క కరిచిన వెంటనే తీసుకోవాల్సిన ప్రథమ చికిత్స, యాంటీ రేబిస్ టీకాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డా. ఎ.వి. ప్రసన్నకుమార్, డా. జి. రాజశేఖర్, టి. శ్రీనివాసరావు, కొప్పాక వెంకట నారాయణ, మట్టపల్లి భరద్వాజ్ (ఎస్బీ వెంచర్స్), ఎమ్ హెచ్ వో వి వినూత్న, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, దాతలు, పెంపుడు జంతువుల యజమానులు పాల్గొన్నారు.

## రామకృష్ణ మిషన్ ఉచిత వైద్య శిబిరం





**సీతానగరం, పెన్ పవర్, జూలై 06:**రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.
మండలంలో సీతానగరం గ్రామంలో కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహారాజ్ తెలిపారు. ఈశిబిరంలో డాక్టర్లు సత్యం రమేష్ బాబు, డాక్టర్ శ్రీనివాస్ నాయుడు సూమారు 250 మందికి రోగులకు వైద్య సేవలు అందించారు.98మందికి రక్త నీరుడు 19 మందికి థైరాయిడ్ పరీక్షలు నిర్వహించారు. పరమాంస యోగానంద నేత్రాలయ వేమగిరి వారిచే సుమారు 78 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 15 మందిని శుక్లాం ఆపరేషన్ నిమిత్తం వేమగిరి ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. 13 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరం వచ్చిన రోగులకు పులిహోర పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి .సుశీల, యాన్నమని వెంకటనారాయణ, రామకృష్ణ మిషన్ కోఆర్డినేటర్ కాను మోను శ్రీనివాస్, యోగానంద నేత్రాలయ ప్రోగ్రాం మేనేజర్ నక్కా చంటిబాబు, తదితరులు పాల్గొన్నారు,

## తూర్పు గోదావరి జిల్లా డీపీఆర్వోగా పి. రవి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 6**
తూర్పు గోదావరి జిల్లా జిల్లా పౌర సంబంధాల అధికారిగా (డీపీఆర్వో) పి. రవి బాధ్యతలు స్వీకరించారు.సోమవారం కలెక్టరేట్లో కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్లను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్లు పి. రవికి అభినందనలు తెలియజేసారు. జిల్లాలో సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.దాదాపు 40 సంవత్సరాల సమాచార శాఖలో వివిధ హోదాల్లో సుదీర్ఘ ప్రభుత్వ సేవల్లో అనుభవం కలిగిన పి. రవి తూర్పు గోదావరి జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారంలో సమర్థవంతంగా వినియోగి స్తారని కలెక్టర్ కీర్తి చేకూరి అభిలాష వ్యక్తం చేసారు.

డీపీఆర్వో పి. రవికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కె. లక్ష్మీనారాయణ, ఇన్చార్జి సహాయ సంచాలకులు ఎం. లక్ష్మణా చార్యులు, సమాచార శాఖ సిబ్బంది, ఇతర జిల్లా అధికారులు ఉన్నారు.

## దస్తావేజు లేఖర్ల ఉపాధినిదెబ్బతీసే జి ఓ 396 ని రద్దు చేయాలి

✷ సిటీ సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు నిరసన




**రాజమహేంద్రవరం, పెన్ పవర్ , జులై 6:**రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది దస్తావేజు లేఖర్ల జీవనోపాధిని

దెబ్బతీసే రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వం జి ఓ 396 ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి వీరెడ్డి, నగర శాఖ అధ్యక్షుడు కోళ్ల రామచంద్ర రావు లు డిమాండ్ చేసారు.

రిజిస్ట్రేషన్ శాఖ సేవలను ప్రైవేటీకరించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, ప్రజల ఆస్తులకు భద్రత కల్పించేలా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే సేవలు కొనసాగించాలని వారు విజ్ఞప్తి చేసారు. ఇవే డిమాండ్లతో స్థానిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖర్లు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిటీ సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం వద్ద సోమవారం దస్తావేజు లేఖర్లు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు వల్ల దశాబ్దాలుగా ప్రజలకు విశ్వసనీయం గా సేవలందిస్తున్న దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు, డి.టి.పి. ఆపరేటర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిగా ప్రైవేట్, కాంట్రాక్ట్ సంస్థలకు అప్పగించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశముందని, ఆస్తుల భద్రత, జవాబుదారి తనం ఉండదని అన్నారు. ప్రభుత్వం దస్తావేజు లేఖర్ల ఉపాధి సమస్యలపై సానుకూలంగా స్పందించాలని, పెండింగ్‌లో ఉన్న లైసెన్సుల పునరుద్ధరణను వెంటనే చేపట్టాలని వారు కోరారు. నగరం చుట్టుపక్కల నాలుగు కార్యాలయాల పరిధిలో సుమారు వెయ్యి మంది వరకు దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు, డి.టి.పి. ఆపరేటర్ల జీవనోపాధిని పరిరక్షించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆస్తుల భద్రతతో పాటు రిజిస్ట్రేషన్ సేవల్లో పారదర్శకత, విశ్వసనీ యత కొనసాగాలంటే ప్రభుత్వ వ్యవస్థ ద్వారానే సేవలు అందించాలని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం ప్రతినిధులు కోరారు. కార్య ఈ కార్యక్రమంలో మహేష్, ప్రకాష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

## మల మూత్ర వ్యర్థాల అక్రమ డంపింగ్ అరికట్టాలి

✷ జిల్లా కలెక్టర్ కి బిజెపి జనతా వారధి బృందం విజ్ఞప్తి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జులై 6:** రాష్ట్రంలో సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరిస్తున్న మానవ మలమూత్ర వ్యర్థాల అక్రమ డంపింగ్ నివారణ, ఎఫ్ ఎస్ టిపి,ఎస్ టిపి విస్తరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని బిజెపి జనతా వారధి బృందం కోరింది. ఈమేరకు జిల్లా కలక్టరేట్ లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ లో బృందం సభ్యులు వినతి పత్రం సమర్పించారు. క్వారీ ఏరియాలో మానవ మలమూత్ర వ్యర్థాల అక్రమ డంపింగ్ పరిశీలించారు. అనంతరం కలక్టరేట్ కి చేరుకొని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జనతా వారిది రాష్ట్ర కోకన్వీనర్ రొంగల గోపి, శ్రీనివాస్ జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, జనతా వారధి జిల్లా జట్టు కృష్ణంరాజు, యానాపు యేసు, సూర్యకిరణ్ మీనాక్షి, పార్టీ నాయకులు రవికుమార్, సాయి, నాగదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు. సామాజిక సమస్యలను తెలుసుకుంటోందని ,ఈ క్రమంలో ప్రతిరోజూ ప్రైవేట్ , మున్సిపల్ సెక్షన్ వాహనాల ద్వారా వేల లీటర్ల మానవ మలమూత్ర వ్యర్థాలు సేకరించ తున్నప్పటికీ అందుకు తగ్గ ల సామర్థ్యంగల ట్రీట్ మెంట్ ప్లాంట్స్ సరిపోవడం లేదని తేలిందని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఈ ప్రమాదకర వ్యర్థాలను నదులు, చెరువులు, కాలువలు, జనావాసాలకు సమీపంలోని ఖాళీ స్థలాలలో అక్రమంగా కుమ్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేసారు. పారిశుధ్య సమస్య కాదని, ఒక పెను ముప్పు లాంటిదని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా పారిశుధ్య కార్మికుల భద్రతకు, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారన్నారు. క్షేత్రస్థాయి అధికారులు ఈ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేశారని పేర్కొన్నారు. జిల్లాల వారీగా ఉన్న ట్రీట్ మెంట్ ప్లాంట్ ల సామర్థ్యం ను సమీక్షించాలని, జిపిఎస్ ట్రాకింగ్ తో వ్యర్థాలను సేకరించే వాహనాలు పర్యవేక్షించాలని వారు కోరారు. కాలుష్య నియంత్రణ మండలి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, గ్రామీణాభివృద్ధి శాఖలతో ప్రత్యేక టాస్కోర్స్ ఏర్పాటు చేయాలని, ప్రతి మున్సిపాలిటీ ,మండలానికి వ్యర్థాల శుద్ధి ఏర్పాటు కల్పించాలని కోరారు. ఈ అంశంపై అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.

## పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ ద్వారా 192 అర్జీలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 6**

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడమే ప్రభుత్వం లక్ష్యమని, ప్రతి అర్జీని పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు.సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ లో కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో రెవెన్యూ సంబంధిత అర్జీలను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. ఈ రెండు కార్యక్రమాల లో మొత్తం 192 అర్జీలు .

ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిగతులను కలెక్టర్ వివరించారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి, ఆర్డీవోలు ఆర్ శివ రాముడు, కె ఆనంద రావు, డీఎస్పీ ఏ. శివ ప్రియ, (సీపీఓ) ఎల్. అప్పలకొండ, డీఎల్‌డీవో పి. వీణాదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోరుకొండలో 'పెన్ డౌన్' నిరసన..

**కోరుకొండ, పెన్ పవర్,జూలై6:** ప్రభుత్వం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో సంస్కరణల పేరుతో తీసుకువచ్చిన జీవో నెంబర్ 396ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కోరుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో 'పెన్ డౌన్' (విధుల బహిష్కరణ) మరియు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

రిజిస్ట్రేషన్ల వ్యవస్థను పీపీపీ (ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం) విధానంలో ప్రైవేటీకరించే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు మరియు డీటీపీ ఆపరేటర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

లేఖర్ల ఆందోళన ఎన్నో ఏళ్లుగా ఈ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వేలాది మంది దస్తావేజు లేఖర్ల లైసెన్సులను పునరుద్ధరించాలని, ఈ కొత్త జీవో వల్ల వారి ఉపాధి పూర్తిగా దెబ్బతింటుందని సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

సేవలను ప్రైవేట్ సంస్థలకు లేదా సేవా కేంద్రాలకు అప్పగించడం వల్ల రిజిస్ట్రేషన్ ఫీజులు పెరిగి, ఇళ్ల స్థలాలు, భూములు కొనుగోలు చేసే సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని అన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి జీవో 396ను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. అనంతరం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.




ఈ పెన్ డౌన్ నిరసన కారణంగా కోరుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ల తయారీ, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడంతో కార్యాలయానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షులు పెదపాటి భీమరాజు,కోట వెంకట సాయి చక్రధర్ (ఉపాధ్యక్షులు)

కాకర్లపూడి వెంకట సూర్యనారాయణ రాజు

యేడిద వెంకట సత్య రామకృష్ణ

జాజుల శ్రీనివాసరావు(రాజా)

మాదేపల్లి వీరభద్రం అనదాసు శ్రీనివాసు,శ్రీపాద వెంకటేశ్వరరావు

బలబద్రుని సాయి ప్రసాద్,పెదిరెడ్ల జగదీష్,మంచాల కృపానందం

పుణ్యమూర్తుల వెంకట నరసింహారావు,పడాల నాగేశ్వరరావు

మేడిపూడి గంగాధర్,రాయపాటి సత్యనారాయణ,వెలిసి రాజు సభ్యులు మరియు స్టాంప్ వెండర్లు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పోలీస్ శాఖ నుండి ఏసిబి, నేర పరిశోధన లను వేరు చేయాలి



✷ రెవిన్యూ లో తహసీల్దార్ల అధికారాలను రద్దు చేయాలి
✷ మీడియా సమావేశంలో ఆర్పీసీ అధ్యక్షుడు మేడా

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 6:**పోలీస్ శాఖలో ఏసిబి, నేర పరిశోధన విభాగాలను పోలీస్ శాఖ నుండి వేరు చేసి ప్రత్యామ్నాయంగా ప్రత్యేక శాఖలు గా ఏర్పాటు చేయాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి)వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. అర్పిసి ప్రధాన కార్యాలయంలో సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షతన

జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అధ్యక్షులు మేడా శ్రీనివాస్ మాట్లాడారు.

బ్రిటిష్ కాలం నాటి పాలనా విధానలే నేటికి పోలీస్ శాఖలో అమలవుతున్నాయని, దిగువ సిబ్బందికి , పౌరులకు కనీస భద్రత లేదన్నారు. ఆనాటి బానిస చట్టాలనే దేశ పాలకులు సవరణలు చేస్తు భ్రష్టు పట్టిస్తున్నరన్నారు. నాడు పోలీసులను చూసి నేరస్తులు భయపడే వారని నేడు పోలీస్ లు పాలకులకు భయపడుతున్నారని, పాలకులు చేసే పాపాలను పోలీస్ లు మోయాల్సి వస్తుందన్నారు. దిగువ పోలీస్ నుండి ఉన్నత అధికారుల వరకు 100 శాతం భద్రత గల నిబంధనలు, చట్టలతో ప్రక్షాళన జరగాలన్నారు. ప్రస్తుత పోలీస్ చట్టాలు నేరస్తులు నేరాల నుండి తప్పించుకోవటానికి, సామాన్యులను వేదించటానికి వినియోగపడుతున్నా యన్నారు. నేడు పోలీస్ శాఖ అప్రతిష్టకు కలుషిత రాజకీయ వ్యవస్తే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు.

పోలీస్ లకు పిర్యాదుల పై ఎఫ్. ఐ. ఆర్. నమోదు చేసే ప్రాధామిక అధికారం మాత్రమే ఉండాలన్నారు. నేర పరిశోధన ను శాఖతో సంబంధం లేని ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నేరస్తులను ఖచ్చితంగా న్యాయస్థానం శిక్షించే విధంగా నేర పరిశోధన విదానాలను సంస్కరించాలని అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కోరారు.

అవినీతి నిరోధక శాఖ (అనిశా) వల్ల అవినీతి పెరుగుతుందని, అనిశా చట్టాలు బలహీనంగా ఉండటం కోర్టు బెయిల్ పై బయటకు వస్తున్నారన్నారు. పెద్ద అవినీతి తిమింగలాల వైపు అనిశా కన్నెత్తి చూడకపోవటం ఈ శాఖ ప్రత్యేకతని ఎద్దేవా చేసారు. పోలీస్ శాఖతో సంబంధం లేకుండా అనిశాను పూర్తిగా వేరుచేసి సంస్కరించాలని, తద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తపరిచారు.

కొన్ని ప్రభుత్వ శాఖలు ప్రజలకు ఉపయోగపడటం లేదని, ప్రజా విశ్వాసాన్ని కోల్పోతున్నాయన్నారు. ఆ శాఖలు వల్ల సమాజానికి చెడు జరుగుతుందన్నారు. పోలీస్ – రెవిన్యూ శాఖల్లో సంపూర్ణ ప్రక్షాళన జరగలన్నారు.

రెవిన్యూ లో తహసీల్దార్ హోదా సంస్కరించాలి...

రెవిన్యూ విభాగంలో తహసీల్దార్ హోదా ప్రజలకు మేలు జరగటం లేదని, ఆస్తులకు భద్రత లేదన్నారు . చట్టబద్ధంగా అధికార విధులు నిర్వహించే తహసీల్దార్లు 20 శాతం ఉండగా, మిగిలిన 80 శాతం మంది అవినీతి, అక్రమాల్లో డాక్టరేట్స్ పొందిన వారేనని ఎద్దేవా చేసారు. తహసీల్దార్ ల స్థానంలో నూతన హోదాతో, ప్రత్యేక శిక్షణతో మెరుగైన రెవిన్యూ సేవలు అమలు చేసే విధంగా ప్రభుత్వం సంస్కరణలను అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ డి వి ఆర్ మూర్తి , వర్ధనపు శరత్ కుమార్ , వాడపల్లి జ్యోతిష్ , ఎమ్. డి. హుస్సేన్, వట్టి శ్రీనివాసరావు , అడపా శేషగిరి , దోషి నిషాంత్ , చల్లా సాంబశివరావు, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్ , వట్టి శ్రీనివాసరావు , మద్దెల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జాతీయ నాయకులు జీవీఎల్ నరసింహారావు పుట్టినరోజు వేడుకలు



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 06.**రాజ్యసభ మాజీ సభ్యులు బిజెపి జాతీయ నాయకులు జీవీఎల్ నరసింహారావు పుట్టినరోజు సందర్భంగా బిజెపి జిల్లా మీడియా కన్వీనర్ నరిసే సోమేశ్వరరావు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం రూరల్ మండలం వెంకట్రామన్న గూడెంలో స్కూలు నందు చిన్నపిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడం జరిగింది ఈ సందర్భంగా నరిసే సోమేశ్వరరావు మాట్లాడుతూ జివిఎల్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియపరుస్తూ వారి ద్వారా బిజెపి నాయకులు, కార్యకర్తలు బిజెపి పార్టీ బలోపేతం అవ్వాలని చిన్నపాటి కార్యకర్తలు కూడా పేరు పెట్టి పిలిచే గొప్ప నాయకుడని అందర్నీ అభిమానించే గొప్ప మానవతావాది జీవీఎల్ నరసింహారావు ని వారికి వారి కుటుంబానికి వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని రాబోయే రోజుల్లో జివిఎల్ నరసింహారావు గారికి మరింత ఉన్నత పదవులు రావాలని వారు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఈ సందర్భంగా జివిఎల్ నరసింహారావు గారికి నరిసే సోమేశ్వరరావు ఫోను ద్వారా శుభాకాంక్షలు తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో బిజెపి రూరల్ మండల అధ్యక్షుడు దుర్గా కాశి విశ్వనాథ్ ప్రధాన కార్యదర్శి కొల్లి రాజశేఖర్ ఏబీవీపీ పూర్వ నాయకులు పృథ్వి కృష్ణ బుర్రె నల్లూరి శీను గంధం రామకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## ప్రైవేట్ పాఠశాల లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

**గోకవరం ఎంఈఓ బి గౌరమ్మ.**



**గోకవరం పెన్ పవర్ జులై 06:-**మండల పరిధిలోని ప్రేవేటు పాఠశాలల (యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను ) ఖచ్చితంగా పాటించాలని నిబంధనలను కఠిన చర్యలు తప్పవని మండల విద్యాశాఖ అధికారిణి బి గౌరమ్మ హెచ్చరించారు. జిల్లా విద్యా శాఖ అధికారి కె వాసుదేవరావు ఆదేశాల మేరకు పలు సూచనలు జారీచేసారు. మండలంలోని ప్రైవేటు పాఠశాలల మాజమాన్యాలు ప్రభుత్వ గుర్తింపు ఉత్తర్వులు లేకుండ ఏలాంటి తరగతులు నిర్వహించకూడదని, ఏడవ తరగతి వరకు మాత్రమే అనుమతి ఉన్న అపర్ ప్రైమరీ పాఠశాలలు తదుపరి ఉన్నత తరగతుల నిర్వహణకు ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుంటే తరగతులు నిర్వహించ కూడదని ప్రభుత్వ ఆదేశాల మేరకు విరుద్ధంగా నిబంధనలను ఉల్లంఘించి ఎవరైన పాఠశాలలు లేదా అదనపు తరగతులన) నిర్వహిస్తే సదరు పాఠశాలల గుర్తింపును రద్దు చేయడానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారము కఠిన చర్షలు తీసుకుంటామని గోకవరం మండల విద్యాశాఖ అధికారిణి బి గౌరమ్మ తెలిపారు.గోకవరం మండలంలో గుర్తింపు పొందిన పాఠశాలలు గోకవరం లో 18 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని ఈ పాఠశాలలు ప్రభుత్వం నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని నిరంతరం నిఘా కొనసాగుతుందని ఎంఈఓ హెచ్చరించారు.

## పలువుని పరామర్శించిన జ్యోతుల రామస్వామి





**గోకవరం పెన్ పవర్ జులై 06:--** ఇటీవల గోకవరం మండలంలో చనిపోయిన పలువురు కుటుంబాలను జగ్గంపేట మాజీ శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు తండ్రి జ్యోతుల రామస్వామి పరామర్శించారు. గోకవరం మండలం రంప ఎర్రంపాలెం గ్రామ తాజా మాజీ ఉప సర్పంచ్ దాకారాపు ధర్మరాజు అన్న దాకారపు అప్పారావు ఇటీవల అనారోగ్యం తో మృతి చెండాడు జగ్గంపేట మాజీ శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు తండ్రి జ్యోతుల రామస్వామి దాకారపు ధర్మరాజు ఇంటికి వెళ్లి ఆయన పరామర్శించి ఆ కుటుంబాన్ని ఓదార్చారు. తిరుమలయపాలెం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దళిత నాయకుడు సంగం వెంకటేశు లు తండ్రి వృద్ధాప్యంతో ఇటీవల మృతి చెందాడు విషయం తెలుసుకున్న జ్యోతులు రామస్వామి తిరుమలయపాలెంలోని సంఘం వెంకటేశులు ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని ఓదార్చారు. ఈయన వెంట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దొడ్డ విజయ్ భాస్కరరావు, పాటి సత్తిబాబు, బత్తిన రామస్వామి, కసిరెడ్డి సతీష్ తదితర వైస్సార్ సిపి నాయకులు గ్రామస్థులు ఉన్నారు.

# దేశ సమైక్యత కోసం త్యాగం చేసిన మహనీయులు డాక్టర్ శ్యామప్రసాదముఖర్జీ.






బిజెపి నేతలు ఘననివాళి.

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జులై 06**: దేశ సమైక్యత సమగ్రతల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయులు డాక్టర్ శ్యామా ప్రసాద ముఖర్జీ అని బిజెపి నేతలు నివాళులర్పించారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి నివాళి కార్యక్రమం సోమవారం బిజెపి తాడేపల్లిగూడెం పట్టణకమిటీ ఆధ్వర్యంలో బిజెపి పట్టణ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను అధ్యక్షుత వహించారు. భారతీయ జనతా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింధు పైడికొండల మాట్లాడుతూ దేశ సమైక్యత సమగ్రతల కోసం ఆత్మ త్యాగం చేసిన మహనీయుడు శ్యామ ప్రసాద్ ముఖ ర్జీ కొనియాడారు. జవహర్ లాల్ నెహ్రూ ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ నెహ్రూ పాకిస్తాన్ తో చేసుకున్న లియాఖిత్ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించి మంత్రివర్గానికి రాజీనామా చేశారన్నారు. కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి ఇచ్చి ఆర్టికల్ 370 ని తీవ్రంగా ఖండించారు. ఒకే దేశం లో ఒకే జెండా ఒకే రాజ్యాంగం ఒకే ప్రధాని ఉండాలని రెండు రాజ్యాంగాలు ఇద్దరు ప్రధానులు రెండు జండాలు ఉండరాదని ఆయన ఉద్యమించారన్నారు. దీనిలో భాగంగా కాశ్మీర్ పర్యటనకు వెళ్లిన శామ ప్రసాద్ ముఖర్జీ ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో ఉంచిందన్నారు. అనుమానాస్పద స్థితిలో ఆయన మరణించారని పేర్కొన్నారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాన్ని ప్రతి కార్యకర్త స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు.. బిజెపి జాతీయ కౌన్సిల్ మాజీ సభ్యులు కర్రి ప్రభాకర్ బాలాజీ మాట్లాడుతూ దేశం కోసం భారతజాతి సమైక్యత కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నాటి ప్రధాని ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ విధానాలతో విభేదించి మంత్రి పదవికి రాజీనామా చేసి దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ అవసరాన్ని గుర్తించి ఆర్ఎస్ఎస్ సహకారంతో 1951లో భారతీయ జన సంఘం పార్టీని నెలకొల్పారన్నారు. ఇదే సమైక్యత కోసం ఉద్యమించి కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని ఒకేదేశంలో ఇద్దరు ప్రధానులు రెండు రాజ్యాంగాల వ్యవస్థ ఉండరాదుని దేశ సమైక్యత కోసం ఉద్యమించారు. బిజెపి జిల్లా నాయకులు తాతాజి మాట్లాడుతూ ప్రతి బిజెపి కార్యకర్త డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. బిజెపి తాడేపల్లిగూడెం పట్టణ ఇన్చార్జి జి.పుల్లాజీ మాట్లాడుతూ బిజెపి కార్యకర్తలు నాయకులు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని పట్టుదలతో సకాలంలో పూర్తి చేసేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను, బి ఎల్ ఏ -1 పాటే నాగేశ్వరరావు, అధ్యక్షురాలు గోకామహాలక్ష్మి, యువ మోర్చా అధ్యక్షుడు కంచర్ల రాజా, ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, కావ్య రెడ్డి, అధ్యక్షులు సత్యనారాయణ, బి ఎల్ ఏ పాటే నాగేశ్వర రావు, ఉపాధ్యక్షులు లచ్చిరెడ్డి సత్యనారాయణ, సామినేని రంగారావు, తుమరాడ చిన్నా, వి ఆర్ వి ఎల్ నారాయణ, ఓ బిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారిశెట్టి నరసింహ మూర్తి, రామగాని సత్యనారాయణ, చెరు కూరిగంగాధరరావు, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సన్నిధి లక్ష్మిదుర్గా, ఉపాధ్యక్షురాలు తుట్టగుంట కృష్ణకుమారి, కూనిరెడ్డి సత్యనారాయణ, అడపా రమేష్, ఇమ్మంది బెనర్జీ,

# ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహణ






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జులై 06:**ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఏరియా పశువైద్యశాల, తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో పెంపుడు జంతువుల యజమానులు, పశుపోషకులు మరియు ప్రజలకు జూనోటిక్ వ్యాధులు (జంతువుల నుండి మనుషులకు వ్యాపించే వ్యాధులు) మరియు రివర్స్ జూనోసిస్ (మనుషుల నుండి జంతువులకు వ్యాపించే వ్యాధులు) పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించరు.

ఈ సందర్భంగా డా. పి. సురేష్ బాబు, సహాయ సంచాలకులు (పశుసంవర్ధక శాఖ), ఏరియా పశువైద్యశాల, తాడేపల్లిగూడెం మాట్లాడుతూ, 1885 జూలై 6న ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ ప్రపంచంలోనే మొదటిసారిగా రేబీస్ వ్యాక్సిన్‌ను విజయవంతంగా మనిషికి అందించిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం జూలై 6ను ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో మనుషుల్లో కనిపించే అంటువ్యాధుల్లో సుమారు 60 శాతం వ్యాధులు జంతువుల నుంచే సంక్రమిస్తాయని, అలాగే కొత్తగా ఉద్భవిస్తున్న అంటువ్యాధుల్లో 75 శాతం జంతు మూలం కలిగినవేనని వివరించారు. జంతువుల ఆరోగ్యం, మనుషుల ఆరోగ్యం మరియు పర్యావరణ ఆరోగ్యం పరస్పరం అనుసంధానమై ఉన్నాయని, "వన్ హెల్త్ " భావనను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు.

ముఖ్యమైన జూనోటిక్ వ్యాధులు

రేబీస్: ప్రధానంగా కుక్కలు, పిల్లులు మరియు అడవి మాంసాహార జంతువుల కాటు లేదా లాలాజలం ద్వారా వ్యాపిస్తుంది. లక్షణాలు కనిపించిన తర్వాత దాదాపు 100 శాతం ప్రాణాంతకమైన ఈ వ్యాధిని పెంపుడు జంతువులకు ప్రతి సంవత్సరం రేబీస్ టీకా వేయించడం, కుక్క కరిచిన వెంటనే గాయాన్ని కనీసం 15 నిమిషాలు సబ్బుతో కడిగి వెంటనే వైద్య చికిత్స తీసుకోవడం ద్వారా పూర్తిగా నివారించవచ్చని తెలిపారు.

లెప్టోస్పిరోసిస్: ఎలుకలు, పశువులు, పందులు, కుక్కల మూత్రంతో కలుషితమైన నీరు లేదా మట్టి ద్వారా మనుషులకు వ్యాపిస్తుంది. రక్షణ పరికరాలు ఉపయోగించడం, కలుషిత నీటిని నివారించడం, ఎలుకల నియంత్రణ వంటి చర్యలు అవసరమని సూచించారు.

బ్రూసెల్లోసిస్: ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందుల నుండి సంక్రమించే ఈ వ్యాధి సోకిన జంతువులను నిర్వహించడం, గర్భస్రావ పదార్థాలను తాకడం లేదా పాశ్చరైజ్ చేయని పాలను తీసుకోవడం వల్ల వ్యాపిస్తుంది. రక్షణ పరికరాలు ధరించడం, పాలను తప్పనిసరిగా మరిగించి వినియోగించడం, పశువులకు టీకాలు వేయించడం ద్వారా నివారించవచ్చని తెలిపారు.

క్షయవ్యాధి (ట్యూబర్క్యులోసిస్): పశువుల నుండి పాశ్చరైజ్ చేయని పాలు, సోకిన జంతువులతో సన్నిహిత సంబంధం లేదా శ్వాస ద్వారా సంక్రమించే అవకాశం ఉందని, పాలను మరిగించి మాత్రమే వినియోగించాలని సూచించారు. అలాగే రింగ్‌వార్మ్, సాల్మొనెల్లోసిస్,టాక్సోకేరియాసిస్, క్యాట్ స్క్రాచ్ డిసీజ్ వంటి ఇతర జూనోటిక్ వ్యాధుల గురించి కూడా వివరించి, పెంపుడు జంతువులను తాకిన తర్వాత తప్పనిసరిగా చేతులు సబ్బుతో కడుక్కోవాలని సూచించారు. రివర్స్ జూనోసిస్‌పై అవగాహన మనుషుల నుండి కూడా కొన్ని వ్యాధులు జంతువులకు వ్యాపించే అవకాశం ఉందని తెలిపారు. కోవిడ్, ఇన్ఫ్లుయెంజా (ఫ్లూ) వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు, కొన్ని యాంటీబయోటిక్ నిరోధక బ్యాక్టీరియా మరియు అరుదుగా క్షయవ్యాధి కూడా మనుషుల నుండి పెంపుడు జంతువులకు సంక్రమించే అవకాశం ఉందని వివరించారు. జ్వరం, జలుబు లేదా ఇతర అంటువ్యాధులు ఉన్నప్పుడు పెంపుడు జంతువులను ముద్దు పెట్టుకోవడం, వాటితో ఆహారం పంచుకోవడం మానుకోవాలని, చేతులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పెంపుడు జంతువుల యజమానులకు సూచనలు ప్రతి సంవత్సరం పెంపుడు కుక్కలు, పిల్లులకు రేబీస్ టీకా వేయించాలి.

పశువైద్యుల సూచన మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి పురుగుల మందులు వేయించాలి.

క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలి.

జంతువులను ముట్టుకున్న తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.

జంతువుల నివాస స్థలం, పాత్రలు, లిట్టర్ బాక్స్‌ను పరిశుభ్రంగా ఉంచాలి. ఈగలు, పేలు, దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలి.

అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత రేబీస్ టీకాల కార్యక్రమానికి పెంపుడు జంతువుల యజమానులు విశేషంగా స్పందించారు. కార్యక్రమం ముగిసే సమయానికి మొత్తం 120 కు పైగా కుక్కలు, పిల్లులకు ఉచిత యాంటీ రేబీస్ టీకాలు అందించబడ్డాయి.

టీడీపీ ఇన్‌చార్జి జగన్నాథరాజు,

జనసేన పార్టీ ఇన్‌చార్జి రాంబాబు,

బీజేపీ ఇన్‌చార్జి రాజా, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డా. అశోక్, సహాయ సంచాలకులు,

ఉప సంచాలకుల కార్యాలయం, తాడేపల్లిగూడెం. డా. శ్రీ హర్ష, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెంకటరామన్నగూడెం, అరుగోలను డా. వి. సునీల్, పశువైద్య సహాయ శస్త్రచికిత్స నిపుణులు

పి. వి. సత్యనారాయణ, పశుసంవర్ధక సహాయకుడు, పశు వైద్యశాల, శివకృష్ణ

సత్యనారాయణ,

జి. యామిని సాయి, ఆదిలక్ష్మి, వెంకటేష పెంపుడు జంతువుల యజమానులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జంతువులు -- ఆరోగ్యవంతమైన మనుషులు -- ఆరోగ్యవంతమైన పర్యావరణం" అనే వన్ హెల్త్ సందేశంతో కార్యక్రమం ముగిసింది.

# పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రజలకు ఉచిత భోజన సౌకర్యం






- పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ప్రారంభం

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, రంపచోడవరం, జూలై 6:**పోలవరం జిల్లాలోని మారుమూల గ్రామాల నుంచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్)కు వచ్చే దరఖాస్తుదారుల కోసం ప్రతి సోమవారం ఉచిత భోజనం, తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత భోజన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, రంపచోడవరం ఆర్డీవో కె. స్వాతి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై వినతులు సమర్పించేందుకు వచ్చే ప్రజలు భోజనం కోసం ఇబ్బందులు పడకుండా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గతంలో చాలామంది దరఖాస్తుదారులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా బయట భోజనం చేయలేక ఆకలితోనే తిరిగి వెళ్లేవారని, ఇకపై ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ ఈ ఉచిత భోజన సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీవోలు స్వయంగా దరఖాస్తుదారులకు భోజనం, కూర, సాంబారు, పెరుగు వడ్డించారు. అనంతరం అధికారులు ప్రజలతో కలిసి భోజనం చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డీఎన్‌వీ రమణ, ఏవోలు ఏ. సత్యనారాయణ, ఎర్రంశెట్టి రాజు, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీధర్, సరిత, శ్రీరామచంద్రమూర్తి, శివతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డోలి సాయంతో పాముకాటుకు గురైన బాలికను వైద్యశాలకు తరలింపు

- 8కిలోమీటర్లు డోలిద్వారా మోసుకొన బంధువులు
- డాక్టర్ లేక చింతూరు వైద్యశాలకు రిఫర్



**కూనవరం,పెన్ పవర్,జూలై6.** పకృతిలో తలదాచుకుంటూ, పకృతిని వారి నివాసంగా మలుచుకుని కొండలపై జీవిస్తున్న కొండ రెడ్లకు వైద్య సదుపాయాలు అందుబాటులో లేక అవస్థలకు గురవుతున్నారు. కూనవరం మండలంలోని కూటూరు గట్టు కొత్త కార్ మాన్ కొండ పై నివసిస్తున్న సూట్రూ లక్ష్మణ్ రెడ్డి కూతురు సమ్మక్క ప్రియా 18సం రాత్రి 1గంట సమయంలో పాము కాటుకు గురైంది. గుట్టలపై నుండి కిందకు దిగేందుకు సుమారు 8 కిలోమీటర్ల దూరం ఉండటం రాత్రి సమయం కావడంతో కాలినడకన అడవి బాటలో డోలిలో మోసుకొని రాలేక రాత్రంతా బంధువులు అక్కడే ఉంచారు. సోమవారం ఉదయం ఉదయం 9:30 గంటలకు డోలి ద్వారా ఆమెను మోసుకొని కూటూరు వైద్యశాలకు తీసుకొచ్చారు. ఆమెను తీసుకుని వచ్చిన సమయానికి డాక్టర్ లేకపోవడంతో చరవాణి ద్వారా సమాచారం తెలుసుకున్న నర్సులు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కొండరెడ్లు నివసిస్తున్న ప్రాంతానికి రోడ్డు మార్గం లేకపోవడంతో గంటల తరబడి డోలిలో మోసుకొని రావాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కొండ రెడ్డి గిరిజనులు కోరారు.



# పోలవరం జిల్లాలో 216 అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- జూలై 7 నుంచి 20 వరకు దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్ కె. దినేష్ కుమార్




**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, రంపచోడవరం, జూలై 6:**

పోలవరం జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలబాలికలు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన పౌష్టికాహార సేవలు అందించేందుకు మొత్తం 216 ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ఎనిమిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 4 అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు, 208 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు, 4 మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. సంబంధిత గ్రామాలకు చెందిన అర్హత కలిగిన మహిళలు జూలై 7 నుంచి 20 వరకు ఆయా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ప్రాజెక్టుల వారీగా మారేడుమిల్లిలో 31 హెల్పర్ పోస్టులు, అడ్డతీగలలో 28 హెల్పర్ పోస్టులు, 2 మినీ అంగన్‌వాడీ పోస్టులు, రాజవొమ్మంగిలో 16 హెల్పర్ పోస్టులు, రంపచోడవరంలో 21 హెల్పర్ పోస్టులు, 1 వర్కర్ పోస్టు, గంగవరంలో 8 హెల్పర్ పోస్టులు, చింతూరులో 43 హెల్పర్ పోస్టులు, కూనవరంలో 32 హెల్పర్ పోస్టులు, 1 వర్కర్ పోస్టు, వీఆర్‌పురం (వేటపాక ప్రాజెక్టు)లో 29 హెల్పర్ పోస్టులు, 1 మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టు భర్తీ చేయనున్నట్లు వివరించారు. నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసక్తి గల మహిళలు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు మరియు ఇతర అవసరమైన ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## గుర్తేడు మండలంలో బిఎల్ఓల పనితీరుపై సమీక్ష




**వై రామవరం /గుర్తేడు, పెన్ పవర్, జూలై 6:** గుర్తేడు మండలంలో ధారగడ్డ గుర్తేడు పాతకోట పంచాయతీలలో జరిగే ఓటర్ల గణనను పర్యవేక్షించడం జరిగిందని వై రామవరం ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు.

ఈ సందర్భంగా బిఎల్ఓలతో మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసే విధంగా అవసరమైన సూచనలు మార్గదర్శకాలు అందించడం జరిగిందన్నారు. ఎస్ ఐ ఆర్ కు సంబంధించి అప్లికేషన్ రిసీవింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం ఫీడ్ స్థాయిలో పను ల వేగాన్ని పెంచడం ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని తెలియజేయడం జరిగిందన్నారు.

## ఏజెన్సీ ఆదివాసీల అవస్థలు పాలకులకు కనిపించవా

వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య



**కూనవరం,పెన్ పవర్,జూలై6.** కూటూరు కొత్త కారుమాను కొండలో పాము కాటుకు గురైన 18 ఏళ్ల బాలిక సమ్మక్క ప్రియను రోడ్డు లేక 8 కి.మీ డోలిలో మోసుకొచ్చిన ఘటనను వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య తీవ్రంగా ఖండించారు.ఏజెన్సీ అభివృద్ధి పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో ఆదివాసీల జీవితాల్లో మార్పు లేదని,నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపించారు.రహదారులు, వైద్యం,తాగునీరు,విద్య వంటి మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సీపీఎం నేతలు,మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు ఫాగింగ్




**వై రామవరం,పెన్ పవర్, జూలై 6:** వర్షాకాలంలో దోమల నివారణ నియంత్రణ కొరకు చవిటి దిబ్బలు, తోటకూర పాలెం గ్రామాలలో సోమవారం ఫాగింగ్ చేయించడం జరిగిందని పంచాయతీ అభివృద్ధి అధికారి తెలిపారు.

గ్రామస్తులందరూ జాగ్రత్తలు తీసుకుని కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, వేడివేడి పదార్థాలు తినాలని తెలిపారు. పంచాయతీ సిబ్బంది యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చేయించినప్పటికీ ప్రజలు పరిసరాలను పరిసరభంగా ఉంచుకోవడం ద్వారా మాత్రమే అనారోగ్య వాతావరణం నుండి బయటపడగలరు అని పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ తెలియజేశారు.ం

## ఘనంగా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి

బీజేపీ మండల కమిటీ సమావేశం




**చింతూరు, పన్ పవర్, జూలై 6:** భారతీయ జనతా పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు పోలవరం జిల్లా చింతూరు మండలంలో బీజేపీ మండల కమిటీ పదాధికారుల సమావేశం మండల అధ్యక్షుడు బట్ట లక్ష్మయ్య రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి నుంచి పార్టీ విస్తరణ, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌ల పనితీరు, రాబోయే పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలతో మమేకమై పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని, పార్టీ అభివృద్ధి కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని బట్ట లక్ష్మయ్య రాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకురాలు బట్ట సుప్రజ, బట్ట రామారావు, అప్పన్న, శివాజీ, గణేష్, సరస్వతి, రాణి, కొండబాబు, వినోద్, భద్రమ్మ, కిట్టమ్మ, వెంకటమ్మ, శేఖర్, సందీప్, ప్రసాద్, ప్రదీప్‌తో పాటు 349, 346 బూత్‌ల కార్యకర్తలు పాల్గొన్నారు.


## పదో తరగతి మార్కుల మెమో పోయిందంటూ-తహసీల్దార్‌కు వినతి

**చింతూరు, పెన్ పవర్, జూలై 6:** చింతూరు మండలానికి చెందిన కురసం దుర్గ భవాని తన పదో తరగతి (ఎస్ఎస్సీ) ఒరిజినల్ మార్కుల మెమో పోయిందంటూ చింతూరు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం, ఆమె 2013 సంవత్సరంలో వి.ఆర్. పురం కేజీబీవీలో చదివి ఎస్ఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం వ్యక్తిగత అవసరాల కోసం తీసుకెళ్లిన సమయంలో 2026 జూలై 2న చింతూరు గ్రామంలో ఎక్కడో మార్కుల మెమో పోయిందని తెలిపారు. ఎంత వెతికినా ఆ ధ్రువపత్రం లభించకపోవడంతో, సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తూ ఫిర్యాదు చేశారు. అసలు మార్కుల మెమో కనిపించకపోవడంతో, సంబంధిత శాఖ ద్వారా డూప్లికేట్ ఎస్ఎస్సీ మార్కుల మెమో జారీ చేయాలని ఆమె తహసీల్దార్‌ను కోరారు. ఇందుకు సంబంధించిన ఎస్ఎస్సీ సర్టిఫికెట్ జిరాక్స్ ప్రతిని కూడా దరఖాస్తుకు జత చేశారు.






## రూ.25 లక్షలతో రామచంద్రపురంలో 6 అభివృద్ధి పనులకు శంకుస్థాపన



- మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో పట్టణానికి వరుసగా నిధులు
- వాసంశెట్టి సత్యం

**రామచంద్రపురం, పెన్ పవర్ జూలై 6:** రామచంద్రపురం పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో మంజూరైన రూ.25 లక్షల నిధులతో చేపట్టనున్న ఆరు అభివృద్ధి పనులకు సోమవారం కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం,మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజు,జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి వాసంశెట్టి సుభాష్ నిరంతరం అభివృద్ధి నిధులు తీసుకొస్తూ రామచంద్రపురాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలోనే సుమారు రూ.60 కోట్లతో రహదారులు,సీసీ డ్రైన్లు,పారిశుద్ధ్య వసతులు,ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టి పట్టణ రూపురేఖలను మార్చివేశామని తెలిపారు.ప్రస్తుతం ప్రారంభించిన పనులు పూర్తయిన తర్వాత ఆయా వార్డుల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వర్షపు నీటి పారుదల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ప్రారంభించిన అభివృద్ధి పనులు:

21వ వార్డు: ముచ్చుమిల్లి రోడ్డులో ఏబీసీ స్కూల్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణం -- రూ.3.09 లక్షలు. 21వ వార్డు: ముచ్చుమిల్లి రోడ్డులో మరో సీసీ రోడ్డు నిర్మాణం -- రూ.3.11 లక్షలు.



22వ వార్డు: బుల్లెట్ నాగేశ్వరరావు వీధిలో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణం -- రూ.3.86 లక్షలు. 4వ వార్డు: మోడ్రన్ కాలేజీ వరకు సీసీ డ్రైన్ నిర్మాణం -- రూ.3.66 లక్షలు. 10వ వార్డు: పోలీస్ క్వార్టర్స్ నుంచి ఏరియా ఆసుపత్రి ప్రధాన రహదారి వరకు సీసీ డ్రైన్ నిర్మాణం -- రూ.2.58 లక్షలు. 11వ వార్డు: ధనకోటి లేఅవుట్‌లో బంధన్ బ్యాంక్ నుంచి పార్క్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం -- రూ.2.49 లక్షలు. ఇవేకాకుండా పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులను కూడా త్వరలో చేపట్టనున్నట్లు వాసంశెట్టి సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీకాంత్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవల్లి శివ,కూటమి పార్టీల నాయకులు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ర్యాబిస్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ప్రపంచ జోనోసిస్ దినోత్సవం సందర్భంగా రామచంద్రపురంలో అవగాహన కార్యక్రమం
- 80 కుక్కలకు ఉచిత ర్యాబిస్ టీకాలు




**రామచంద్రపురం, పెన్ పవర్ జూలై 6:** ప్రపంచ జోనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం ప్రభుత్వ పశువైద్యశాలలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జోనోసిస్ వ్యాధులపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడం, ర్యాబిస్ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించడంపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వక్తలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమలాపురం పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎన్. అనిత హాజరై ర్యాబిస్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజారోగ్య పరిరక్షణలో పశువైద్య శాఖ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, జంతు ఆరోగ్యాన్ని కాపాడితేనే ప్రజారోగ్యం సురక్షితంగా ఉంటుందని అన్నారు. పెంపుడు కుక్కలు, పిల్లులు వంటి జంతువులకు తప్పనిసరిగా ర్యాబిస్ నివారణ టీకాలు వేయించాలని, జోనోసిస్ వ్యాధులపై ప్రతి కుటుంబానికి అవగాహన అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం, పశువైద్య శాఖ చేపడుతున్న ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని, అవగాహనతోనే ర్యాబిస్ వంటి ప్రాణాంతక వ్యాధులను పూర్తిగా నివారించవచ్చని చెప్పారు.

రామచంద్రపురం సహాయ సంచాలకులు డాక్టర్ ఓ. రామకృష్ణ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం



ప్రపంచ జోనోసిస్ దినోత్సవాన్ని అన్ని ప్రభుత్వ పశువైద్యశాలల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జోనోసిస్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ క్విజ్ పోటీలు నిర్వహించడం ద్వారా ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందిస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం పశువైద్యశాలలో సుమారు 80 కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ నివారణ టీకాలు వేశారు. ర్యాబిస్ వ్యాధి నివారణకు టీకాలే శాశ్వత రక్షణ అని పశువైద్య నిపుణులు వివరించారు.ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారిణి డాక్టర్ జి. విజయదుర్గ (నరసాపురపుపేట),టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవల్లి శివ,పారా వెటర్నరీ సిబ్బంది,పశు సంవర్ధక సహాయకులు,శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరం అంబేద్కర్ గురుకులంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం.





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 6:** ఏలేశ్వరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తు న్నారు. ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి ఆధ్వర్యంలో సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ తమ సొంత ఖర్చులతో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర శారద అభ్యర్థన మేరకు సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) సొంత నిధులతో ఈ పనులు నిర్వహించారు.ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా కళాశాల ప్రాంగణంలో గడ్డి, చెత్త పేరుకుపోయి పారిశుధ్య సమస్య ఏర్పడిం దని ప్రిన్సిపాల్ శారద ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ట్రస్ట్ ద్వారా ప్రాంగణంలోని గడ్డి, చెత్తను తొలగించి పరిసరాలను పూర్తిగా పరిశుభ్రం చేసే పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ విద్యార్థినులు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేలా అవసరమైన పారిశుధ్య చర్యలు చేపట్టామని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యాసంస్థల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమం కోసం సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ తరఫున సహకారం కొనసాగుతుందని అన్నారు. మరో ఐదు రోజులపాటు కళాశాల ప్రాంగణం అత్యంత సుందరంగా తీర్చిదిద్దే పని కొనసాగుతుందన్నారు. ఈగలు దోమలు, విషపురుగులు ప్రాంగణంలో లేకుండా ఉండేందుకు పారిశుధ్య పనులు చేపడుతున్నామని, పిల్లలకు ఆటలు ఆడుకునేందుకు వీలుగా ఆటస్థలం సిద్ధం చేస్తున్నామన్నారు. పిల్లలు చదువుకునేందుకు ఆరోగ్యవంతమైన వాతావరణం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామరాజు వర్మ, మండల విద్యాశాఖ అధికారి బి. అబ్బాయి, ప్రిన్సిపాల్ శారద, కళాశాల సిబ్బంది, చారిటబుల్ ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## మూడో టీ20లో బౌలింగ్‌లో మార్పులకు సిద్ధం.. టీమిండియాలో అదనపు పేసర్‌కు అవకాశం!

**మూడో టీ20లో భారత్‌కు విజయం తప్పనిసరి**

**సిరీస్‌లో ఇంగ్లండ్ 1-0 ఆధిక్యం**

**బిష్ణోయ్ స్థానంలో ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం**

**నిలకడగా రాణిస్తున్న వారిలో అభిషేక్ శర్మ ఒక్కడే**

**బ్యాటింగ్, బౌలింగ్‌లో మెరుగుదలపై భారత్ దృష్టి**

**మంగళవారం రాత్రి 10 గంటలకు ట్రెంట్ బ్రిడ్జ్‌లో మ్యాచ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** వరుస పరాజయాలతో ఒత్తిడిలో ఉన్న భారత జట్టు.. ఇంగ్లండ్‌తో మంగళవారం జరిగే మూడో టీ20లో తప్పక గెలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా రాత్రి 10 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. రెండో మ్యాచ్‌లో ఓటమిపాలై సిరీస్ లో వెనుకబడిన భారత్‌కు ఈ మ్యాచ్ 'డూ ఆర్ డై'గా మారింది. మరోవైపు ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉన్న ఇంగ్లండ్ ఈ మ్యాచ్ గెలిచి మరింత ఆధిక్యంలోకి వెళ్లాలని చూస్తోంది. ఈ ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ లో తొలి మ్యాచ్ వర్షం వల్ల ఫలితం తేలకుండానే రద్దయింది. రెండో మ్యాచ్ లో ఇంగ్లండ్ గెలిచింది. దాంతో నేటి మ్యాచ్ టీమిండియాకు కీలకంగా మారింది. రెండో మ్యాచ్‌లో భారత జట్టు బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ నిరాశపరిచింది. ముఖ్యంగా బౌలింగ్ విభాగం తీవ్రంగా విఫలమైంది. రెండో టీ20లో స్పిన్నర్ రవి బిష్ణోయ్ నాలుగు ఓవర్లలో 60 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంతేకాదు, ఒకే ఓవర్లో మూడు బ్యాక్‌ఫుట్ నోబాల్స్ వేయడంతో జట్టు భారీ మూల్యం చెల్లించుకుంది. దీంతో మూడో మ్యాచ్‌లో బౌలింగ్ కూర్పులో మార్పులు చేయాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. బిష్ణోయ్ స్థానంలో యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం లభించే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రసిద్ధ్ కృష్ణ కంటే ప్రిన్స్ యాదవ్‌కే జట్టు మొగ్గు చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. బ్యాటింగ్‌లోనూ భారత జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఓపెనర్ అభిషేక్ శర్మ మాత్రమే 59, 43 పరుగులతో నిలకడగా ఆడుతున్నాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ కొంతమేర పరుగులు చేసినా మ్యాచ్‌ను మలిచే ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన తొలి అంతర్జాతీయ సిరీస్‌లో గుర్తుండిపోయే ప్రదర్శన చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. సిరీస్‌లో నిలవాలంటే బ్యాటింగ్‌లో దూకుడు, బౌలింగ్‌లో కచ్చితత్వం తప్పనిసరి అని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పవర్‌ప్లేలో వికెట్లు తీయడం, డెత్ ఓవర్లలో పరుగులను నియంత్రించడం భారత్‌కు కీలకంగా మారింది.

## నార్వే చేతిలో బ్రెజిల్ ఘోర ఓటమి.. వెక్కి వెక్కి ఏడుస్తూ కెరీర్‌కు గుడ్ బై చెప్పిన నెయ్‌మార్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా వరల్డ్ కప్--2026 లో బ్రెజిల్ ప్రయాణం ముగిసింది. నార్వే చేతిలో 2-1 తేడాతో ఓడిపోవడంతో వరల్డ్ కప్ నుంచి ఔట్ అయ్యింది. మ్యాచ్ లో విజిల్ కేవలం బ్రెజిల్ ప్రపంచ కప్ నుండి బయటకు పంపడమే కాకుండా.. ఆ దేశ స్టార్ ప్లేయర్ నెయ్‌మార్‌ను కన్నీళ్లు పెట్టుకునేలా చేసింది. జూలై 5, శనివారం జరిగిన రౌండ్ ఆఫ్ 16లో నార్వే చేతిలో బ్రెజిల్ 2-1 తేడాతో ఓడిపోయింది. దీంతో సీనియర్ ఫార్వర్డ్ మోకాళ్లపై కూర్చొని ప్రార్థించి, ఆ తర్వాత కన్నీళ్లు పెట్టుకున్నాడు. గ్రౌండ్ లో ఈ ఎమోషనల్ దృశ్యాలు వైరల్ గా మారాయి. నెయ్‌మార్ కన్నీళ్లను ఆపుకోలేక ఇబ్బంది పడుతుండగా, అతని సహచర ఆటగాడు రాఫిన్హా వచ్చి ఓదార్చుతున్న వీడియో వైలర్ గా మారింది. టోర్నమెంట్ నుంచి బ్రెజిల్ ఎగ్జిట్ అయ్యిందన్న ఆవేదన, ఇక తన చివరి మ్యాచ్ ఇదే అనే ఆందోళనతో చాలాసేపు వెక్కివెక్కి ఏడుస్తూ గ్రౌండ్లోనే కూర్చుని ఉండిపోయాడు.

**బ్రెజిల్ పోరాటం వృధా..**

నాకౌట్ పోరులో బ్రెజిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగినప్పటికీ.. నార్వే అద్భుత ప్రదర్శనతో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. నార్వే గోల్ కీపర్ ఓర్జాన్ నైలాండ్, స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్‌ల పట్టుదలతో నార్వే అద్భుత విజయాన్ని సాధించింది. పోటీ అంతటా నైలాండ్ బ్రెజిల్‌ను నిరాశపరిచాడు. ఫస్ట్ హాఫ్ లో బ్రూనో గిమారేస్ పెనాల్టీని ఆపిన నైలాండ్.. ఆ తర్వాత చేసిన వరుస సేవ్స్ నార్వేను ఆధిక్యంలో ఉంచడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత సెకండ్ హాఫ్ లో హాలాండ్ రెండుసార్లు గోల్ చేసి, స్కాండినేవియన్ జట్టుకు చారిత్రాత్మక విజయంతో క్వార్టర్-ఫైనల్స్ అంచుకు చేర్చాడు. స్టాపేజ్ టైమ్ చివరి నిమిషాల్లో, బాక్స్ లోపల కాసెమిరోపై ఫౌల్ జరిగిందని తేలడంతో, రిఫరీ వివాదాస్పద పెనాల్టీని ఇవ్వడంతో బ్రెజిల్‌కు చివరి ఆశ చిగురించింది. నెయ్‌మార్ ముందుకు వచ్చి, ప్రశాంతంగా పెనాల్టీని గోల్‌గా మలిచి, తేడాను 2-1కి తగ్గించాడు. అయితే, ఆ గోల్ కేవలం ఓదార్పుగా మాత్రమే మిగిలిపోయింది. చివరి క్షణాల వరకు దృఢంగా నిలబడిన నార్వే.. బ్రెజిల్ ఆశలకు గండికొట్టింది. చివరి ప్రపంచ కప్ ఆడుతున్న నెయ్ మార్.. నార్వేతో ఓటమిని జీర్ణించుకోలేకపోయాడు. టోర్నమెంట్ నుంచి టీమ్ ఎగ్జిట్ కావడం తట్టుకోలేక.. భావోద్వేగానికి గురయ్యాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్న దృశ్యాలను చూసి ఫ్యాన్స్ కన్నీటిపర్యంతం అయ్యాడు. సహచర ఆటగాళ్లు ఓదార్చడానికి ప్రయత్నించగా మరింత దుఖసంద్రంలో మునిగిపోయాడు. కన్నీళ్లతో నిలబడి రాఫిన్హాను కౌగిలించుకున్నాడు. గాయం కారణంగా నెలల తరబడి ఆటకు దూరంగా ఉన్న నెయ్ మార్.. ఆశతో ప్రారంభమైన టోర్నమెంట్ ఇలా అర్ధంతరంగా ముగియటంతో దుఖాన్ని ఆపుకోలేకపోయాడు. తన ఫుట్ బాల్ ప్రయాణానికి తుది వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు.

## ఆరు వికెట్లతో చెలరేగిన గుర్నూర్ బ్రార్.. రెండో టెస్టులో ఇండియా-ఎ గెలుపు



**హైదరాబాద్ పెన్ పవర్:** బౌలింగ్‌లో గుర్నూర్ బ్రార్ (6/68) సూపర్ షో చూపెట్టడంతో.. శ్రీలంక--ఎతో జరిగిన అనధికార రెండో టెస్ట్‌లో ఇండియా-ఎ 10 వికెట్ల తేడాతో గెలిచింది. దాంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-0తో కైవసం చేసుకుంది. లంక నిర్దేశించిన 33 రన్స్ లక్ష్యాన్ని ఛేదించేందుకు ఆదివారం నాలుగో రోజు బరిలోకి దిగిన ఇండియా రెండో ఇన్నింగ్స్‌లో 6.2 ఓవర్లలో 36/0 స్కోరు చేసి గెలిచింది. సాయి సుదర్శన్ (25 నాటౌట్), అమన్ మోఖడే (11 నాటౌట్) ఈజీగా గెలిపించారు. అంతకుముందు 541/8 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 143.3 ఓవర్లలో 543 రన్స్‌కు ఆలౌటైంది. సారాన్ష్ జైన్ (70 నాటౌట్) మెరుగ్గా ఆడాడు. కేశర నువాంత 5, సుదీర 3 వికెట్లు తీశారు. తర్వాత లంక రెండో ఇన్నింగ్స్‌లో 48.3 ఓవర్లలో 209 రన్స్‌కు ఆలౌటైంది. దాంతో ఇండియా ముందు 33 రన్స్ లక్ష్యాన్ని ఉంచింది. ఆషెన్ బండార (87) టాప్ స్కోరర్. నువాంత (26), సుదీర (21) ఫర్వాలేదనిపించారు.

## వరుస ఫ్లాప్స్ లో వున్న హీరోలకు అదృష్టం తెచ్చిన దర్శకులు!

**ఆకర్షణీయమైన రత్న వర్ణాల దుస్తుల్లో మెరిసిపోతున్న సంయుక్త**





సినిమా ఇండస్ట్రీలో హిట్లు, ఫ్లాపులు చాలా సహజం. ఎంత పెద్ద స్టార్ హీరో అయినా కొన్నిసార్లు వరుస పరాజయాలతో సతమతమవ్వక తప్పదు. అలాంటి క్లిష్ట సమయంలో కొందరు ట్రెండింగ్ దర్శకులు తమ అద్భుతమైన టేకింగ్, పవర్ ఫుల్ మాస్ కథలతో ఆ హీరోలకు ఊహించని రేంజ్ లో కం బ్యాక్ ఇచ్చారు. థియేటర్లలో పూనకాలు తెప్పించి, బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన ఆ క్రేజీ కాంబినేషన్ల విశేషాలు ఇప్పుడు చూద్దాం.

పవన్ కళ్యాణ్ రేంజ్ మార్చిన 'గబ్బర్ సింగ్': 'తీన్ మార్', 'పంజా' లాంటి వరుస పరాజయాలతో పవన్ కళ్యాణ్ కెరీర్ కొంచెం డల్ గా సాగుతున్న టైమ్ అది. ఫ్యాన్స్ అంతా ఒక సాలిడ్ హిట్ కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఇక సరిగ్గా అప్పుడే దర్శకుడు హరీష్ శంకర్ ఎంట్రీ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ స్వాగ్‌ను, ఇమేజ్‌ను పర్ఫెక్ట్ గా వాడుకుంటూ ఆయన చేసిన మ్యాజిక్కే 'గబ్బర్ సింగ్' (2012)మూవీ. ఇక థియేటర్లలో మాస్ ఎలివేషన్లతో రచ్చ లేపిన ఈ సినిమా, ఇండస్ట్రీ హిట్ గా నిలిచి పవన్ కు గ్రాండ్ కం బ్యాక్ ఇచ్చింది.

**బాలయ్య మాస్ పవర్ చూపించిన 'అఖండ':**

నందమూరి బాలకృష్ణకు మాస్ లో ఉన్న ఫాలోయింగ్ ప్రత్యేకమైనది. అయితే 'కథానాయకుడు', 'మహానాయకుడు', 'రూలర్' వంటి వరుస ఫ్లాపులతో ఆయన కెరీర్ కాస్త ఇబ్బందుల్లో పడింది. అలాంటి టైంలో బాలయ్య నమ్మకమైన దర్శకుడు బోయపాటి శ్రీను రంగంలోకి దిగారు. ఇక వీరిద్దరి కలయికలో వచ్చిన 'అఖండ' (2021) టాలీవుడ్ ను ఊపేసింది. అఘోరా పాత్రలో బాలయ్య విశ్వరూపం, బోయపాటి హై-వోల్టేజ్ యాక్షన్ సీన్లు సినిమాను బ్లాక్ బస్టర్ గా నిలబెట్టాయి.

**నాగార్జున ట్రెండ్ సెట్టర్ 'శివ':**

అక్కినేని నాగార్జున కెరీర్ మొదట్లో 'నిర్ణయం', 'చైతన్య' వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడలేదు. కెరీర్ కాస్త డీలా పడిన తరుణంలో, ఒక కొత్త దర్శకుడు టాలీవుడ్ హిస్టరీని తిరగరాశాడు. ఆయనే రామ్ గోపాల్ వర్మ. 1989లో వచ్చిన 'శివ' సినిమా అప్పటివరకు ఉన్న కమర్షియల్ ట్రెండ్‌ను పూర్తిగా మార్చేసింది. ఇక సైకిల్ చైన్ సీన్, రియలిస్టిక్ యాక్షన్ తో ఈ సినిమా నాగార్జునను రాత్రికి రాత్రే యూత్ ఐకాన్ గా మార్చేసింది.

**రవితేజ ఎనర్జీని పెంచిన 'క్రాక్':**

మాస్ మహారాజా రవితేజ వరుసగా 'టచ్ చేసి చూడు', 'నేల టిక్కెట్టు', 'అమర్ అక్బర్ ఆంథోనీ' వంటి డిజాస్టర్లతో ఫామ్ కోల్పోయారు. ఆయన ఎనర్జీకి తగ్గ హిట్ పడట్లేదని ఫ్యాన్స్ ఫీల్ అవుతున్నప్పుడు, దర్శకుడు గోపీచంద్ మలినేని తోడుండటంతో సీన్ మారింది. ఇక 2021లో వచ్చిన 'క్రాక్' సినిమాలో పోతురాజు వీరశంకర్ గా రవితేజ పవర్ఫుల్ పోలీస్ క్యారెక్టర్ లో అదరగొట్టారు. ఈ సినిమా రవితేజ కెరీర్ లోనే బెస్ట్ హిట్లలో ఒకటిగా నిలిచింది.

**ఎన్టీఆర్ బాక్సాఫీస్ వేట 'జనతా గ్యారేజ్':**

యంగ్ టైగర్ ఎన్టీఆర్ కు నటనలో తిరుగులేదు, కానీ 'రామయ్యా వస్తావయ్యా', 'రభస' వంటి సినిమాలు నిరాశపరచడంతో ఆయన మార్కెట్ పై ప్రభావం పడింది. ఆ సమయంలో దర్శకుడు కొరటాల శివ ఎన్టీఆర్ కు ఒక డిఫరెంట్ స్క్రిప్ట్ ఇచ్చారు. అదే 'జనతా గ్యారేజ్' (2016). ఎన్టీఆర్‌ను కేవలం మాస్ హీరోగానే కాకుండా, పర్యావరణంపై బాధ్యత ఉన్న పాత్రలో చాలా హుందాగా చూపించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి, ఎన్టీఆర్ కు ఘనవిజయాన్ని అందించింది.

వరుస ఫ్లాపులు వచ్చినా, సరైన కథ మరియు దర్శకుడు దొరికితే హీరోల క్రేజ్ మళ్లీ ఎక్కడికో వెళ్తుందని ఈ సినిమాలు నిరూపించాయి. టాలెంట్ ఉన్న దర్శకులు హీరోల ఇమేజ్ కు తగ్గట్టుగా ప్లాన్ చేస్తే థియేటర్లలో ఎలాంటి సంచలనాలు సృష్టించవచ్చో ఈ కాంబినేషన్లే మనకు బెస్ట్ ఎగ్జాంపుల్స్. అందుకే సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడు ఎవరి టైమ్ మారుతుందో చెప్పడం కష్టం.



**బీచ్‌లో సూర్యాస్తమయ కాంతిలో శమా సికందర్ ఆకర్షణీయమైన రూపం**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965